రాధామాధవసంవాదము



వెలిదిండ్ల వేంకటపతి

రాధా మాధవ సంవాదము

కర్త
వెలిదిండ్ల వేంకటపతి

యస్. అప్పలస్వామి అండ్ సన్సు
పబ్లిషర్సు అండ్ బుక్ సెల్లర్సు,
రాజమండ్రి
1949

వెల 1-0-0

శ్రీరస్తు

రాధామాధవసంవాదము

ప్రథమాశ్వాసము

క. శ్రీరుక్మిణిమనోహర, కారుణ్యసుధాసముద్ర కంసమథనయ
క్రూరాంబరీషసుజనా, క్రూరచిదానంద కృష్ణగోపముకుందా. || 1 ||

వ. అభ్యుదయపరంపరాభివృద్ధిగా నారచియింపంబూనిన రాధామాధవసంవాదం బను మహాప్రబంధంబునకుఁ గథాక్రమం బెట్టి దనిన. || 2 ||

చ. అనవరతప్రబోధకరమౌ మిథిలాపురమందు నొక్కనాఁ
డనఘుఁడు ధన్యుఁడౌ జనకుఁ డార్యులతో సుఖలీల నుండి సొం
పున సకలావతారముల పుణ్యకథ ల్వివరింప వించు నా
చనవున వేఁడెఁ గృష్ణకథ సత్యనిధిన్ శుకయోగిరాయనిన్. || 3 ||

చ. అడిగిన భక్తితోడఁ బులకాంకితుఁడై నయనాంబుజంబులన్
వెడల యుదంబుధార యదువీరుని గృష్ణుని సన్నుతింపఁగాఁ
బడసితి నెంతభాగ్య మని పద్మదళాక్షుఁ దలంచి మ్రొక్కుచున్
బడలిక దీఱఁ బాపములు వాఱఁగ భాగ్యము చేర నిట్లనెన్. || 4 ||

గీ. జనకరాజేంద్ర వినవయ్య సావధాన, మతిని
గృష్ణనిచరితముల్ మహిని విందు మవి రుచింపవు మాకు మాయనుభవంబు,
చెలగుశృంగారరూప మౌ జిత్తగింపు. || 5 ||

మ. యమునాతీరమునందు బృందదరి బాగౌపల్లె వ్రేపల్లె నా
నమరున్ గొల్లలపల్లె తజ్జనులభాగ్యం బెంతవర్ణింతు మొ
ల్లముగా నందఋఁ గొల్లలాడుదుఋ పాల న్నేతఁ దన్నేతయై
యమితానందుడుఁ నందుఁ డందు దగు దేవాధీశభోగంబులన్. || 6 ||

సీ. తీరుగాఁ గైసేయు తేరులచందానఁ, బొదుగులతోడి యాఁగదుపు లమరఁ
గనుఁగానక మదించుగజములకైవడిఁ, గొమ్ములవృషభము ల్కొమరుమిగులఁ
జివ్వకు నటు కాలు ద్రవ్వువీరులరీతిఁ, జలపోరి పెనగుకోడెలు చెలంగఁ
జెంగున దాఁటుతురంగంబులవితానఁ, జురుకైనలేఁగలు సొంపుమిగుల
గీ. వదియె చతురంగబలములై యతిశయిల్ల, మొల్లమై యున్నవ్రేపల్లె నల్లుకొన్న
ఫలితవనములు కోటలై పరిఢవిల్లు, నందుఁ జెలువొందు నందుఁ డానంద మొంది. || 7 ||

క. ఒకపశువుఁ బ్రోచువానికి, సకలఫలంబులును గల్గు సంతతమును కో
టకు మించు పశుగణంబులఁ, బ్రకటంబుగఁ బ్రోచు నతనిఫల మే మందున్. || 8 ||

గీ. అతని పుణ్యంబుననొ లేక యతనిపుణ్య, పత్నియగు యశోదాదేవి భాగ్యముననొ

కృష్ణుఁ డుదయించె వారి కింకేమి తెలుప, జలజనయనునిభక్తవాత్సల్యమహిమ. ॥ 9 ॥

చ. చిగురులపాదము ల్కళలఁజిల్కెడు వ్రేళ్ళు నొయారిపిక్కలున్
జిగితొడ లందపుంబిఱుఁదుఁ జెన్నగుబొజ్జ వెడందఱొమ్ము బా
గగుకరము ల్మనుంగళము నద్దపుఁజెక్కులు నవ్వుమోము తే
టగుకనుదోయి ముద్దుగురియన్ బెరిఁగెన్ హరి యందు బాలుఁడై. ॥ 10 ॥

సీ. పట్టాభియోగసౌభాగ్యము ల్తిలకించి, నందుండు సంతతానంద మొందఁ
దొట్రుపల్కులు ముద్దుదొలఁకునవ్వులు గాంచి, మురిసి యశోద సమ్మోద మంద
నవమోహనాంగసౌందర్యంబు భావించి, పసిగాఁపుగుబ్బెతల్ పైఁబడంగఁ
బూటపూటకు వృద్ధి బొందురూపముఁ జూచి, జను లెల్ల నాశ్చర్యమునఁ జెలంగఁ
గీ. దలిరువలె గోమునై మొగ్గవలెను సోగ, యై యలరువలె మృదువునై కాయవలెను
బెక్కువై పండువలె నెఱచొక్క మగుచుఁ, దేనెవలెఁ దేటయై శౌరి తేజరిల్లె. ॥ 11 ॥

ఉ. అప్పుడు లేఁతప్రాయమున నాడుచు నందునిముద్దుఁ జెల్లెలౌ
కప్పురగంధి రాధ యనుకన్నియ యొక్కయనామధేయుఁ భి
న్నప్పుడె పెండ్లియాడి మగఁడం చని చూడదు వాని వాఁడు నా
యొప్పులకుప్పఁ గన్గొనఁగ నోడును వ్రీడను గొల్లవెట్టిచేన్. ॥ 12 ॥

క. వెన్నెలను జలువ పుట్టిన, చెన్నునఁ బువ్వులను దావి చెలఁగినరీతిన్
గన్నియసకలాంగంబులఁ, దిన్నఁగ నొకవింత వొడమె దినదినమునకున్. ॥ 13 ॥

క. వనిత తనుఁదానె చూచుక, తనలో దా నుస్సు రను వితాకై తనకున్
దనసొగసుకుఁ దనముచ్చట, కనువైనప్రియుండు లేని యారాటమునన్. ॥ 14 ॥

క. తొల్లి తప మేమి చేసెనొ, కొల్లగఁ బసిబాలుఁ డైన
గోపాలునితో
మల్లాడుచు నెల్లప్పుడు, చెల్లాటల నుండు రాధ జిలిబిలి తమిచేన్. ॥ 15 ॥

క. బాలుఁ డగు శౌరి నెత్తుక, హేలాగతి ముద్దులాడు నేప్రొద్దు వృథా
కాలక్షేపంబునకును, జాలక రాధాలతాంగి చాలవిరాళిన్. ॥ 16 ॥

ఉ. భావిఫలాభిలాషమున బాలుని కేమఱ కుగ్గు వెట్టు బె
య్యావులపాలతో జలకమార్చును దాఁ దొడనుంచి యేమిచూ
చేవని నవ్వుచున్ బయఁటచేఁ దడియొత్తి సిరామరక్షతో
గావుగఁ జుక్కబొట్టు నొసలన్ ఘటియించి కదించు నుయ్యెలన్. ॥ 17 ॥

ఉ. నావెలలేనిమానికమ నాతొలినోములమెట్టపంట నా
దేవుఁడ నామనోరథముఁ దీర్ప జనించిన చక్కనయ్య నా
జీవనజీవనంబ యదుశేఖర యించుక నిద్ర పోఁగదే
యో వెడమాయకాఁడ! యని నుయ్యెల నూఁచును రాధ మాధవున్. ॥ 18 ॥

గీ. ఏమఱించి కృష్ణుఁ డిండ్లలోఁ జొరఁబడి, యున్న పాలు పెరుఁగు వెన్న నెయ్యి
కొల్లలాడుచుండ గోపిక లొకనాఁడు, దొమ్మి గూడి రాధతోడ ననిరి. ॥ 19 ॥

క. ఉట్లపయి నున్న వెన్నల, చట్లెల్లను గొంచుఁబోయి సంగాతులతో
నాట్లాడఁదొడఁగె మాబ్రతు, కెట్లా కడవెళ్ళునమ్మ యిట్లాగయినన్. ॥ 20 ॥

క. ముద్దిమ్మని బలిమిని మా, ముద్దియచే నున్నవెన్నముద్దలు గొనె నీ
ముద్దులబాలుఁడు నీ కిది, ముద్దయినన్ కొమ్మ మాకు ముద్దటవమ్మా. ॥ 21 ॥

క. బంతులటంచును జెలిచను, బంతులు బిగిఁబట్టి లేదు బంతి యటంచున్
గంతులు వైచె చను మముఁ గని, కాంతా యిటు తగునె యెంతకలవారలకున్. ‖ 22 ‖

క. మందకుఁ జని రాఁగను మా, మందగమన నాఁగి నీదుమగఁ డెవఁ డనుచున్
గందువమాటల నడిగె, న్నందమె మనజాతి కిట్టి యాగడము చెలీ. ‖ 23 ‖

క. నీవైన బుద్ధి తెలుపుము, నీవలనను గాకయుండె వేమె యశోదా
దేవికి దెలిపెద మనఁగా, నావేళకుఁ బులిమిపుచ్చి యారాధ వడిన్. ‖ 24 ‖

క. ముద్దిచ్చును గోపాలుఁడు, వద్దను నడయాడుచున్నవార్తలు విన్నన్
గద్దించును లేదన్నను, బద్దించును జూడకున్నఁ బరితాపించున్. ‖ 25 ‖

ఉ. ఓయి మనోహరాంగ పని యున్నది పోయెదుగాని యిట్లు రా
వోయి మహానుభావ యని యూరక పిల్చును బిల్వ నేమి రా
ధా యని యాతఁడున్ బలుకఁ దా విని నవ్వును వేగ నిందు రా
కోయి భుజింపఁగా వలదటోయి యటంచు వచించు బాలితోన్. ‖ 26 ‖

చ. పడుచులతోడ నాడ పసిబాలుఁడవా వలదన్న మాన వా
గడములు కొన్ని నేర్చితివి కల్లరి వైతివి కొల్లకాఁడ వై
దుడుకులు సేయసాగితివి దొంగిలఁజొచ్చితి వేమి తెల్పినన్
వడిగఁ బరాకు చేసికొని వాకిటి కేగెదు పిల్వఁబిల్వఁగన్. ‖ 27 ‖

ఉ. బుద్ధులు దెల్పఁబోవుగతిఁ బూనుక కన్నులు పుల్కుకొంచునే
ప్రొద్దున లేచి యిండ్లఁబడి పోయెద వమ్మకచెల్ల పిన్నవుం
బెద్దవుఁ గావు బువ్వ దీనిపించెదఁ జక్కనిసామి రార నా
ముద్దులకృష్ణ రార యని మ్రొక్కుచుఁ జీరును రాధ మాధవున్. ‖ 28 ‖

ఉ. అల్లుఁడ దొండపండు వలెనా యని వాతెర యాన నిచ్చు నీ
కొల్లవె పుట్టచెండు నివిగో యని చన్గవఁ బట్ట నిచ్చు రా
గిల్లి మయూరపింఛ మడిగేవని పెన్నెరు లంట నిచ్చుఁ బో
కల్లరి యంచుఁ గృష్ణుఁడు నగ న్నగి రాధ యదేమిరా యనున్. ‖ 29 ‖

సీ. తీరుగాఁ కస్తూరితిలకంబు దిద్దుచో, గమకించి నెమ్మోముఁ గదియఁ జేర్చు
హొయలుగా గంధంబు మెయినిండఁ బూయుఁచో, బరికించి యిక్కువల్ గరగనంటు
మెలపుగా సిగను బూవులదండ చుట్టుచో, బులకించి కుచము వీఁపున ఘటించు
హరువుగాఁ గైసేసి యుద్దంబుఁ జూపుచో, దిలకించి తనమోముఁ దెలియఁజూపుఁ

గీ. జెలఁగి మాటాడబోవుచోఁ జెక్కు గీటు, బిలిచి వీడెం బొసంగుచోఁ బెదవిఁగ్రోలు
గదిమి పైఁబడఁ దిగుచుచోఁ గౌగిలించు, దమి మనంబున నాఁటి రాధావధూటి. ‖ 30 ‖

క. కడిమాడ సేయు భోజన, మిడుఁ బిడికిట నిముడు వలువ లిచ్చును బెడఁగౌ
తొడవులు దొడుగును బడిబడి, గడెగడె కొకవింతెసొగసు గావించు హరిన్. ‖ 31 ‖

సీ. ఎవతెతో సయ్యాట మింటిలోన నటంచు, భయపడ వదలించు బైటనుండి
చంటిపైక సడల్చి జారుపైట ఘటించి, యేది బాగని వేఁడు నెదుట నిల్చి
వాకిట మగవారు రాకుండ నిలుమంచు, జలువకోక ధరించుఁ దలుపుమూల
దాఁగనేరవు పల్కుదారి గాదని దూరు, వలదని మురిపాన వద్దఁ జేరు
గీ. నాఁడునాఁటికి గోపాలుఁ డీడు మీఱి, తొలుత నూనూఁగుమీసాలతోఁ జెలంగఁ
బదరి మునువలెఁ బైబక్కఁ బడఁగ నళికి, బెళకు వగఁగుల్కు మరునికి బెదరి రాధ. ‖ 32 ‖

క. ఆరాధమనోజవ్యధ, నీరీతుల నిరుగుపొరుగు లెఱుఁగక యుండన్

గారాబు సేయఁ గృష్ణుఁడు, చేరక తా నది పరాకు చేయుచునుండెన్. || 33 ||

సీ. తొలుదొలఁ బసిగాపుఁ గులుక గుబ్బెత యొంటి, పాటైనమోము తప్పకయె చూచుఁ
జూపు వెంబడిఁ దన్నుఁ జూచి సిగ్గున నిల్వ, దల యూఁచి కోరికల్ దెలియ నవ్వు
నవ్వు వెంబడిఁ బిన్ననాటిమచ్చిక లెంచి, నను నయో దయ జూడ వనుచుఁ బలుక
బలుకు వెంబడి గేలఁ బైఁటకొం గెడలించి, నునుజన్ను లాన ఱొమ్మునకుఁ జేర్చు
గీ. జేర్చి మునిపంట జిగిమోవిఁ జిరనొక్కు, నొక్కి సొక్కించి మరుకేళి స్రుక్కఁజేయుఁ
జేసి కనుమాటి యింటికిఁ జేరనరుగు, నరిగి తనుగానిరీతి తనంత నుండు. || 34 ||

క. ఆచిన్నెలు సవసవఁగా, జూచాయఁగ విని చలించి స్రుక్కినరాధన్
జూచి యదేమే రాధా, నాచాయన్ సిగ్గువడెదు నాహరి కనియెన్. || 35 ||

సీ. చెంత నీవును లేక చింతతోఁ బవళించి, నిదురబోవుచునుండ నిన్నరేయి
కలలోన నొక్కచక్కనిరాచకొమరుండు, దోఁచె నెవ్వఁ డటంచుఁ దెఁచదాయె
నొకకొంతసేపు తప్పక చూడఁజూడంగ, నీపోలికై యున్న నీవటంచు
రార కృష్ణాయని బారతోఁ జేసాప, నేమె రాధాయని యెదురుకొనుచు
గీ. నెనసి యేమేమొ వింతగా నింపొనర్చె, నంత మేల్కాంచి నినుఁ గాంచి యది తలంచి
మురిపెమున నిన్నుఁ జూడక మోమునంచు, కొంటి నాసిగ్గు నేమనుకొందు నోయి. || 36 ||

మ. అనినం బక్కున నవ్వ చిక్కితివి రాధా సాధువే యంచు నుం
టిని నీనాథునిమీఁదిప్రేమ వినగంటిని దుంటవిల్దంట వెం
టనె యంట న్ననవింటితూఁపు లెద నంటన్ దుంట లింకేల నీ
ధ్వని వాచారసభావభావభవగాథల్ నీ వగ ల్దెల్పెడిన్. || 37 ||

క. విరిదాఁపఁ దావి దాఁగునె, పరిపరి పలుకేల నిజము పలిగితి వౌ నౌ
ధర వినమె "సత్యవాణీ సరస్వతీ" యటన్నమాట చదువులలోనన్. || 38 ||

క. అని పల్కు శౌరిపలుకులకును మెచ్చుచు నిన్నినాళ్ళకును నీవైనన్
మన సెఱిఁగి చిక్కఁబట్టితి, తనుఁ బో యని కృష్ణుం తోడఁ దా ని ట్లనియెన్. || 39 ||

సీ. కండచక్కెరపానకంబు గావలెనందు, వది గోర వేమిరా యంబుజాక్ష
రంగుబంగరుబొంగరాలు గావలెనందు, వవి గోర వేమిరా మదనజనక
యిసుకతిన్నెలమీఁద నెక్కిగావలెనందు, వది గోర వేమిరా మదనరూప
తోడిబాలురతోడ నాడగావలెనందు, వది గోర వేమిరా యమర వంద్య
గీ. తియ్యనై యున్న యలమోనితేనె వలతొ?
జంటగొనియున్న యలచన్ను లంటవలతొ?
త్రొక్కి కదసినపిఱుఁదుల నెక్కవలతొ?
జోడువాయక స్త్రీలతో నాడవలతొ? || 40 ||

ఆ. నీకువాడమెల్ల నిన్నరాతిరి గంటి, నమ్మచెల్ల న్నిను నమ్మరాదు
నవ్వు గాదు రేయి నా ప్రక్కలోనుండి, కలువరించలేదె చెలులనెల్ల. || 41 ||

ఉ. అందుల కాసయేని మగవాండ్రపయిం బడి దూరు వొందఁగా
నెందుకు కంటి కింపయినయింతుల నల్గురఁ బెండ్లి సేయవో
పొందుగఁ బ్రొద్దుపోకలకుఁ బూనితివేనియు మేము నేరమో
యందఱవంటిముచ్చటలు నాటలు పాటలు నోటిమాటలున్. || 42 ||

క. చిన్నప్పుడె యెడఁబాయక, కన్నుల నిన్నెపుడుఁ జూడఁగలిగుండును నేఁ
డెన్నంగ నీదుసముఖము, క్రొన్నెలపొడు పయ్యె గగనకుసుమం బయ్యెన్. || 43 ||

చ. అరమరలేక నీకొఱకు నల్లికబిల్లికగా వసింతు మి

ద్దఱి మపు డెవ్వరున్ మనలఁ దాకి తలంపరు నేఁడు వింటివో
మఱి వినలేదొ యీజనులమాటలు వాడల నాడ నాడ నీ
పరువులు చూచి నాపయిని పాపముఁ గట్టి రిఁ కేమి తెల్పుదున్. || 44 ||

క. మచ్చరమున నొక రనుకొన, నొచ్చెము నాయందుఁ గలదె యొకనాఁడైనన్
ముచ్చటగా నినుఁ గౌఁగిఁట, గ్రుచ్చితినో లేనిచౌరవకుం జొచ్చితినో. || 45 ||

క. నే నిందుకొఱకె నవ్వస, హా నోడుదు వట్టినింద లందితి నయ్యో
యైన దిఁక నాయె నందుకె, పూనుద మందఱకుఁ గన్ను పొడిచినరీతిన్. || 46 ||

క. నామనసులోనికోరికి, సీమజనంబులె నిజంబు చేసిరి మన కీ
నీమం బెందుల కీవఱ, కేమాయెను గొదవ లోకు లిటులాడుటచేన్. || 47 ||

సీ. చూడనేర్చిననాఁడె సొలపుగా మునుమున్నె, చేరంగ నినుఁ గటాక్షించినావు
నవ్వనేర్చిననాఁడె ననువుగాఁ దొలుదొల్త, నాతోడ వగగుల్క నవ్వినావు
పల్కనేర్చిననాఁడె భావంబుగా ముందు, నత్త త్త రమ్మని యాడినావు
నడవనేర్చిననాఁడె నమ్మికగాఁ దొల్త, దొడరి చేపట్టి కాల్ ద్రొక్కినావు
గీ. నాఁడు సేయనియోజన నేఁడు గలదె, మరుఁడు దైవంబు సాక్షులు మనమనములు
విను సదాచారనిరతులు విబుధులైన, ఘనులు తారాశశాంకులు గాదె మనకు. || 48 ||

చ. అన విని రామ రామ యిటు లాడఁగఁ జెల్లునె నీకుఁగాక నా
మన సరయందలంచితివొ మక్కువతోఁ గరుణించి నీవు పెం
చినతను వింత నీ వగడుసేసిన కాదనువార లెవ్వ రిం
దున కొడిగట్టినన్ వెనక దోసము గాదఁటె రాధికామణీ. || 49 ||

క. నీతోడఁ జర్చ సేయఁగ, బోతే నామనసు కొకటి పొడమినఁ బొడమున్
నీతోడఁ బలుకరా దిఁక, వాతప్పితి మొదలఁ బడుచువాఁడను నేనున్. || 50 ||

క. అని విఱుగ నాడి యంతనె, తనసంగడికాండ్రు పిలువ, దా నాపలుకుల్
విని హో యని యెలుఁ గిచ్చుచు, వనజాక్షుఁడు వెడలె మరల వచ్చెద ననుచున్. || 51 ||

చ. రమణియు నంతఁ లేదొరకురత్నము నాఁచుకపోయినట్టు లోఁ
గుములుచు నేరికిన్ దెలుపఁగూడక దొంగను దేలుగుట్టు చం
దమునఁ దపించుచు న్నలినాథుఁడు మున్ విడనాడినట్టివా
క్యములకు సంగతుల్ తఱచుగాఁ దలబోయుచుఁ జింత సేయుచున్. || 52 ||

గీ. పొరుగులిరుగులచెలులతో బోయె ననుచు, గొండెములు దెల్పును యశోద కోపగింప
శౌరి రూపింపుమని తన్నుఁ గోర నెవరి, నడుగవచ్చెదు పడుచుల నడుగు మనుచు. || 53 ||

సీ. పనిలేనిపని జారుపైఁటతో నడయాడు, ముసిముసినగవుతో మోము వంచు
గడెగడె కొకవింతగా మేనుఁ గైసేఁయు, దోడిబోటుల వృథా దూరి పలుకుఁ
బలుమారు ముంజేతిచిలుకను ముద్దాఁడు, గని కాననటులఁ గ్రేగంటఁ జూచు
నొంటిపాటైనచో నుస్సురు మని నిల్చు, దనుఁజూచునెడ గిరుక్కున దొలంగు
గీ. నవల నివలను గుసగుసల్ సవసవలుగ, వినియు వినములుగాఁ జేసికొనుచు మొదటి
నీటులకుఁ బోక పోవక నిలువలేక, మురియు నీలీల గోపాలుమ్రోల రాధ. || 54 ||

క. డాయు నినుఁ జెంతఁ బిలిచితి, వాయను నిన్నేనుఁ బిల్వ నంచన నట్టే
పోయి నునుబువ్వు లివి వలె, నే యనునవి వలదటన్న నిఁక నెట్టు లనున్. || 55 ||

ఉ. ఘల్లున మ్రోయ వందియలు గజ్జలు మువ్వలు సందడింపఁగా
వల్లనిమేనుడా లమర నవ్వుచు నల్లన నీవు రాఁగ రా

గిల్లుచు రబాతో దిగియ గిల్లెద వేమిర మెల్ల మెల్లనే
యల్లుఁడె యర్థ మియ్యమని యందురు గావున నెవ్వఁ డేమనున్. ॥ 56 ॥

క. రారా నందకుమారక, రారా నవనీతచోర రారా కృష్ణా
రారా రాజులయేలిక , రారా ముద్దులమురారి రారా శౌరీ. ॥ 57 ॥

శా. రారా నందకుమార రార యదువీరా రార రాకాసుధా
ధారాకార మనోహరాంగ దయలేదా యైన నాయింటికిన్
రారాదా నినువంటివాని కిది మేరా నిన్ను నేమంటిరా
యేరా నీదగుజుంటితేనెతెరమో వీరా మనోవల్లభా. ॥ 58 ॥

చ. ప్రకటమనోజరూప పసిబాలుఁడ వంచును నమ్మి ప్రక్క నుం
చుక నిదురించఁగాఁ బుఱుకుచున్ గుచముల్ బిగఁబట్టి మేను మే
నికిఁ గదియించి పల్పెదవి నిల్పితి వేమిర మేనమామపో
లికలకుఁ జొచ్చినాఁడవొ? భళీ యనుచున్ దలయూఁచి నవ్వుచున్. ॥ 59 ॥

గీ. ఒంటి నెదురైన రాధ యోరోరి కృష్ణ, దాళు తాళు మటంచనఁ బాళు శౌరి
పదుగు రున్నప్పుడొకమాట పైఘటించి, తాళు తాళు మటంచనుఁ దనకుఁ దానె. ॥ 60 ॥

చ. విడు విడు నీ కొసంగ నని వేఁతొకబాలున కొక్కతియ్యమా
మిడిఫల మీయఁబోవ బలిమింగొని తా మొనపంట నొక్కి గ్రు
క్కెఁడురస మాని సీత్కృతు లొగిం జెలఁగం దల యూఁచి చూచెఁ గే
రడమున రాధికామధురరాగసుధాధర వీటి సారెకున్. ॥ 61 ॥

క. ఆముద్దు చూచి రాధిక, యేమటితి నదేమి చూచి తీవన నగి నే
నేను నినుఁ జూచినట్టులు, నీమనసునఁ దోఁచెఁ దెలుపు నీవని వేఁడన్. ॥ 62 ॥

చ. తెలిపెద రమ్మటంచు సుదతీసుణి దుప్పటికొంగుఁ బట్టి లో
పలిపడకింటికిన్ దిగువఁ బద్మదళాక్షుఁడు మోడిమానిసిం
బలెఁ జని తెల్పుమంచనిన మంచిది పానుపుఁ జూడుమన్న ని
శ్చలుఁడయి కొంతసేపునకు జవ్వనిఁ దప్పక చూచి యిట్లనున్. ॥ 63 ॥

ఉ. మొన్నని తెల్పలేదఁటవె మొన్నటి నిన్నటి పిన్నవాఁడ నాఁ
కొన్నను నీవు భోజనము కోరి యిడన్ వలె నెత్తి పెంచినా
వెన్నఁడు లేనిమాట లిటులేటికి నాడెదు మాటిమాటికిన్
గన్నులఁజూడు మల్లుఁడను గానఁటవే యన రాధ యిట్లనున్. ॥ 64 ॥

సీ. పసిబాలఁ డందునా పరికింప నూరిలో, నీవు జూడనియట్టి నెలవు లేదు
వగఁ గాన వందునా మగఁడు నీవే యని, నీరాకఁ గోరని నెలఁత లేదు
విననేర వందునా విద్యల యొరగల్లు, నీ వెఱుంగపాటి నీతి లేదు
దయఁ జూడ వందునా ప్రియముతో నయముతో, నీవు లాలింపని నెలఁత లేదు
గీ. అన్నిటను జాణవే యౌదు వైన నాదు, కూర్మి నెఱుఁగ నిదొక్కటే కొదవ నీకు
నీకు నీయంతఁ దోఁచని నెనరు కలిమి, వచనరచనలఁ దెల్ప నెవ్వరితరంబు. ॥ 65 ॥

ఉ. పెంచినదాన నంచుఁ దలఁపించెదు సారెకు సారె నీదు ప్రా
పెంచినదాన నౌదు నిదె యెన్న రహస్యము మావిపిల్కలన్
వంచన లేక పాదినిడి వారక పోషణ చేసి పెంపు గా
వించుట తత్ఫలం బనుభవించనొ యన్యులపాలు సేయనో. ॥ 66 ॥

మ. వినరా వావుల కేమి కాముకుల మున్ విన్నాము కన్నాము లే
నినుఁ బోలంగలవానిఁ గాన మవులే నీ నేర్పు లోకంబులె

ల్లను గల్పించినధాత భారతికి యేలా లోలుఁడై వావి గై
కొనఁడాయె న్నిటువంటిసామెతలు నీకు న్నాకు గానున్నవే. ॥ 67 ॥

ఉ. లేదని కుందినన్ ఫలము లేదని దైవము దూర నేల? నీ
కే దయ రావలెన్ వెనుక నీవె తలంచుక చేరఁదీవలెన్
కాదని పైకొనన్ వరుస గాదని నిన్నెద నమ్మియుంటి నీ
వే దయ లేక నన్నుఁ గడ కింతకుఁ దెచ్చుటఁ నేఁ డెఱింగితిన్. ॥ 68 ॥

శా. ఓహో యత్తను వంటెనేని నతఁ డాయుష్మంతుఁ డౌనంట నా
యూహాలోకము సామెతాయె నన వేదోక్తంబు గాదందువే
నాహా మంచిది భూమిసామికిని నాలై యుండి యత్తౌట సం
దేహంచా యిది వేదమందె వినవా నీమాట నీకే తగున్. ॥ 69 ॥

ఉ. ఎన్నఁడు పెద్దవాఁ డవుదు వెన్నఁడు జాణతనంబు నేర్తు వీ
వెన్నఁడు నామనంబు ఫలియింపగఁ జేయుదు వంచు గోరి నే
నున్నది వల్లవీజనుల యుల్లముఁ జల్లగఁ జేసి మెచ్చుకొం
చు న్ననవింటివానిపని చూఱలు వెట్టుటకా మనోహరా. ॥ 70 ॥

ఉ. భూషణభూషి తాంగ పరిఫుల్లసరోరుహనేత్ర నీకు సం
తోషము వచ్చినప్పుడె ననున్ దయజూతువు గాక యూరకే
దోషమటంచు న న్వెతలఁ ద్రోయకు నేనిఁక మాన నీవపు
ర్వేషవిలాసమేఘము భరించెద మత్కుచపర్వతంబులన్.. ॥ 71 ॥

క. విను కాకుండిన వేఱొక, తనువున నినుఁ జెట్టఁబట్టఁదలఁచెద నపుడున్
వినవేమొ వావివరుసలు, తనువులకర్మంబొ జీవధర్మమొ చెపుమా. ॥ 72 ॥

వ. అనిన నబ్బాలికామణికి గోపాలచూడామణి యిట్లనియె. ॥ 73 ॥

ఉ. క్రమ్ముక యెన్ని పల్కెదవు కానివిపోనివి గుంపు సేసి వే
దమ్ములు నీతులుం దగవు ధర్మము శాస్త్రములున్ స్మృతుల్ పురా
ణమ్ములు నీకుఁ జక్కవయినన్ వినువారికిఁ జక్కనౌనె నీ
సమ్మతు లూరివారలకుఁ జాటవలెంగద నేఁడు ముందుగన్. ॥ 74 ॥

ఉ. మంచితనాన వల్దనినమాటలు నీ కెగబోఁత లయ్యె నౌ
నంచు భవత్ప్రియంబునకు నై వినినం గొఱ గా దిదేల నీ
కించుకవల్ల నేమి యొకయించుక వావి దలంచుకొమ్ము మ
న్నించుము నన్ను ముచ్చటయు నేస్తముఁ జాలదె రాధికామణీ. ॥ 75 ॥

ఉ. వెంటనె పాప మేల యవివేకము గట్టెదు వావి గాదు న
న్నంటకు మన్న ఱంతులిడి యల్లునిమంచితనంబు లేదు పొ
మ్మంటివి యత్తసేయుపని కాఱడి లేదనుటే నిజంబు నీ
వంటియభిజ్ఞురాలి కిటువంటివి నుంచి వొకే తలంపఁగన్. ॥ 76 ॥

గీ. అవనిఁ గాంతలు స్వేచ్ఛావిహారు లగుట, తెలిసియే కాదె బ్రహ్మ విధించినాఁడు
మగువకొక్కఁడె మగవాఁడు మగఁడు గాఁగ, రాధ యిది ధర్మశాస్త్రవిరోధముగద. ॥ 77 ॥

వ. అనిన గోపాలగ్రామణికి రాధికావధూమణి యిట్లనియె.

క. మహి దేహసుఖ మెఱుంగక, తహతహపడి పరసుఖంబుఁ దాఁ గన కిహమున్
నహి పరము న్నహి యైతే, సహజమ యామగనిఁ గొల్వఁ జలమో ఫలమో. ॥ 78 ॥

మ. గతి వీఁ డంచును బిన్ననాఁడు తమవేడ్కన్ బెద్ద లొప్పింతు రె
వ్వతె కెవ్వాఁడు మగండు కొసరు మనోవాక్కాయకర్మంబులం
బతి యెవ్వాఁడని తోఁచె వాఁడె పతిగా భావించునాలే పతి
వ్రత నాసమ్మత మీమతంబు చెడుత్రోవన్ బోవ నే వెట్టినే. ‖ 79 ‖

క. ఒక్కటి గల దైన మనో, వాక్కాయములందుఁ జెడ్డవారలత్రోవల్
ద్రొక్కక మక్కువ నొక్కఁడె, దిక్కని దక్కినదియే పతివ్రత తలఁపన్. ‖ 80 ‖

క. మగఁడు మగండని మగువలు, తగవులు నడపినను గాక తమ రొల్లనిచో
నగుఁ గాదని దండించునె, తగవున ధర్మాసనమునఁ దగి మగఁ డోహో. ‖ 81 ‖

క. నిను నౌఁ గాదన నేమో, యన వెఱతును గాని మిగిలినందులకైతే
ననువారు వీరు నౌగా, దనఁగాఁ బనియేమి యొకరికై బ్రతికెదనే. ‖ 82 ‖

చ. బుడుతవు నీ వసడ్డతనముల్ బచరించెదు బుజ్జగించి నే
నడిగినఁ బాపమంచనెర వంతకు నీకుఁ బనేమి నీకుఁగా
బడిబడి బాలనాఁడు మఱి పాలును నుగ్గిడునాఁడు నుగ్గునున్
నడపుచు నేనె పెంతునట నాకు స్వతంత్రత లేకపోయెనే. ‖ 83 ‖

చ. పలుకుల కేమి యే వగను బల్కఁగఁజాలవు నిన్ను మించి యు
క్తులు పచరింప నాతరమె తొల్లిటివారలయాడికోలుమా
టలెకద పల్కఁబోయిన నొడంబడికల్ పని గావు నాపయిన్
చలమొ ఫలంబొ యేల కరసానలబట్టెదు మౌక్తికంబులన్. ‖ 84 ‖

ఉ. పాపము పుణ్య మేర్పరుపఁ బాల్పడినాఁడవె నీవు నీకు నీ
పాపము లేల నీకొఱకుఁ బైబడి దీనత నొందజేసె నా
పాపము నిన్నుఁ గూడఁగల భామల కబ్బెను బుణ్య మిందుపైఁ
బాపము పుణ్యముం గలదె భావమునన్ బరికించి చూడగన్. ‖ 85 ‖

శా. పో నామాటలు పూర్వపక్షములు గాఁ బోనాడి పోనాడి యౌ
నౌ నీమాటలె నిల్పుకొంటి నవి సిద్ధాంతంబుగాఁ జేసి నీ
తో నింకేటివితండముల్ పలుక నేర్తు న్నేఁటితో నిగ్రహ
స్థానం బైతిని నీవి దెల్పుపలుకే శాస్త్రంబు తర్కింపఁగన్. ‖ 86 ‖

క. శృంగారకవితవంటిది, యంగన కడుఁబ్రేమచేత నానందముతో
నంగీకరించినం దగు, భంగంబున కోర్వఁగలదె భావజ్ఞనిధీ. ‖ 87 ‖

చ. లలితుఁడ వౌదు వంచు మొదలన్ జదివించినదెల్ల నేఁటికిన్
గలిగెను గాళ్ళపైఁ బడినకామినిఁ గాదని వాడ వాడలన్
గలమగనాండ్రకాళ్ళఁ బడఁగాఁ జదు వున్నదె మాట లేల నన్
సొలపునఁ గూడరా మనసుతీఱఁగ జల్లనిమాటలాడరా. ‖ 88 ‖

క. అల్లుఁడ వైనందులకున్, జెల్లుగ నుపకార మొకటి సేయుము నామే
నెల్లఁ గడుఁ గ్రాఁగుచున్నది, చల్లనినీమేన నొత్తి చల్లార్చు మిఁకన్. ‖ 89 ‖

గీ. నన్నుఁ దాఁకినపుడె నామేనికాఁకలు, నిన్ను సోఁకు నసుచు నెన్నవలదు
నిన్ను సోఁకఁబోదు నిను మున్ను గూడిన, మందసతులతనువులందుఁ గాక. ‖ 90 ‖

చ. ఇపుడు మదీయవాక్యముల కీకొనవో యని డెందయారకే
తెపతెపఁ గొట్టు కాడెడిఁ బదింబదిగా నిదె చూడు మంచు న
చ్చపలమృగాక్షి లేచి యలసారసలోచను కేలుఁదమ్మి నం

దపుటురమందు మోపుకొని తల్పు బరాలన మూసి కృష్ణునిన్. ॥ 91 ॥

ఉ. గొబ్బున శయ్యకున్ దిగిచి గుత్తపుటబ్బురపుబ్బుసిబ్బెపుం
గుబ్బ లురంబునం దలమి క్రుమ్మచు మెచ్చుచు మోవితేనియల్
జుబ్బనఁ జూఱఁగాఁ గొనుచు సొక్కుచు ముద్దులఁ గొల్లలాడె త
బ్బిబ్బయి కొంతసేపు చెలి ప్రేమ నదే మనుచున్ వచింపకన్. ॥ 92 ॥

గీ. అత్త మల్లాడునప్పు డయ్యంబుజాక్షుఁ, డూరకుండుట సరిపోలకుంట గాదు
పరవశతచేత నేమియు బదులుసేయ, మనసులో దోచకుండిన యునికి గాని. ॥ 93 ॥

సీ. మొదలఁ బుక్కిటివీడె మొసఁగి యెంగిలి గాదె, మంచి దిమ్మనుచు నిప్పించుకొనును
తానె గుబ్బ లురంబు నాని దోసము ద్రొబ్బు, మంచని కేలఁ బట్టించుకొనును
పలుమోపి తప్పాయె బదులైనఁ బరిహార, మంచు కెమ్మోవి నొక్కించుకొనును
పరవశయై మ్రొక్కి మఱచితి నే బెద్ద, వంచని మరల మ్రొక్కించుకొనును
గీ. ఒకటి చెలిగోర శౌరి దా నొకటిగోర, గొమరుబ్రాయంపుధనమెల్లఁ గొల్లలాడి
రిద్దఱును దోడుదొంగలై యింక మరుని, కేమి లంచంబు లిత్తురో యెఱుఁగరాదు. ॥ 94 ॥

సీ. కనుబొమల్ ముడి వెట్టుకొని నీవు నే నంచు, వరుసవెంబడుల కైవాదు లాడి
యాయతంబై నిల్చి యటు కేల నొడ్డుక, విరులబంతులతోడ వ్రేటులాడి
యాయముల్ దాకి హా యని వొచ్చి రోషాన, మురళించి గోళ్ళచే నఱకులాడి
కెరలి చేపట్లైనఁ గ్రిందు మీఁ దయి పోర, బిగువుతో సందీక పెనఁగి కూడి
గీ. బడలి సొక్కుచు సోలుచుఁ బాన్పుమీద, బడుచు లేచుచు మరలఁ బైఁబడుచునుండి
రిద్దఱును గొంతసేపు పెన్నుద్దులగుచు, జిగురువిలుకానిబిరుదు మాప్తి లనంగ. ॥ 95 ॥

వ. ఇట్లు పెనంగుచు ననంగసంగరారంభమున కిద్దరుం జొరక యగరుధూపధూమంబుల
గుబులుకొను కమ్మకస్తూరితావులం బొనుగువడి కొంతవడిఁ జిత్రరూపంబులకైవడి
గదలకుండి రంత నగ్గోపికాకాంతునిం గవయుతమకంటున నక్కంబుకంఠి యిట్టట్టు
గొట్టుకాఁదుచు నతఁడు గదిసినఁ గదియనీక యవాంతరలజ్జాభయంబున దాఁపురం
బులు వెట్టుచు నట్టిట్టు గుట్టునం జిట్టాడి బట్టినం దట్టివైచి యొయ్యొనొయ్యనం
బయ్యెదకొంగుఁ దిగిచి యుబికినచనుమిట్టల కెట్టకేలకుఁ గేలు సాచినం బట్టీక చిట్టా
డుచు పట్టువిడుపుల చిట్టకంబులను వేగిరింపక యేమఱించి లాలించి కౌగిలించినం
గృష్ణుండు గదిమి యదుముచు, నుదుటుసిబ్బెంపుటుబ్బు గబ్బిగుబ్బ లురమ్మునం
గ్రుమ్మి సొమ్మసిల హా యని కనుదమ్ములం దేలవైచుచు, మోహంపువగలను
మోము మోమునం జొనుపవచ్చినం దప్పించి యొప్పక యవ్వల నివ్వలఁ ద్రిప్పి యబ్బిన
యెడలం గొబ్బునం జుబ్బనఁజూఱఁగా వాతెరఁ గ్రోలిన నఱగన్ను వైచుచు బెండు
వడి మునింగి విడువిడు మని విదళించి బదులు తెమ్మని పెదవి మొదలానం బొదవి
యాని నాలుకచేఁ బైపైఁ బెణకుచు, చూడకుమని డాకేలఁ గ్రేగన్నులు మొగిచి
నలకేలఁ జనుముక్కులు పులిమి బలిమిం దక్కితివని చురుక్కునం జుక్క లేర్పడ
నొక్కుచు, మక్కువను గోటిఁసోకులం బొక్కిలి నిమిరి యవ్వలఁ దడవఁగడంగినఁ
దడంబడుచు, మెడబలిమితనంబున మోహరంబుగ దేహంబు లాహిరింగొను తెఱంగు
నకుం గఁలగి కన్మోగిచి నగుచు, నఖంబులం జెక్కిలి మీటుచు, లెమ్ము లెమ్మని
కమ్మవిల్తునికేళికిం బయికొల్పిన మెలఁకువలం గవకవలు చెవులం దవులం జొనిపి
తనివిదీఱక విడిపడక యొడలెల్లం గలయం గరఁగించితి వేడ నేర్చితి? వెవ్వతెమీదిఁ
పరాకునం బడలితి? వలసితి, విదిరా సుఖానందం, బిదిరా వింతచందం, బని
పయ్యెదకొంగునఁ జెమట లెడనెడం దుడుచుచు, బొమలు ముడుచుచు, నన్నుం
జూడకుమని చివుక్కునం బయికొని యంతకంతకుఁ గందుకంబాడు కెవడిం
దూఁగాడుచు, మఱియునుం బాతరలాడురీతులం గుల్కుచు, నల్లనల్లన లకుముకి
తెఱంగునం గెరలుచు, నప్పటప్పటి కాముద్దు లద్దంబునీడలం జూచుచు, నిట్లు
సేసెద విది యెట్లు మఱతురా యని భావవిరహంబు దోపఁ గొంతవడి నిశ్చలంబుగ
నుండి తలయూఁచుచు, రాలుపువ్వులు గ్రమ్ముచెమటయు జాఱుక్రొమ్ముడియు

నెఱుంగక యందందు వింతపిలుపులం బిలుచుచుఁ గంతుసాయుజ్యంబందుచందంబున
దనువు లేకీభావంబుగా నంటుకొన వ్రాలుచుఁ బ్రేమాతిశయంబునం జొక్కుచుఁ,
గరంగుచు, నమ్మాధవుండు రాధికాపుంభావసంభోగశృంగారక్రీడానందసాగరంబున
మునుంగుచుం, దేలుచుండె నంత. ॥ 96 ॥

చ. తెలతెలవాఱఁజొచ్చె నలుదిక్కులు విచ్చె శుకీపికావళుల్
కలకలఁ గూయఁజొచ్చె మఱి కంతుఁడు విల్ రతిచేతి కిచ్చెఁ దే
టులరొద హెచ్చె జక్కవకుటుంబము విచ్చె సమీరుఁ డంత శ్రాం
తులకు ముదంబుఁ దెచ్చె మది నొచ్చె విటీవిటచోరకోటికిన్. ॥ 97 ॥

సీ. మినుకుఁజెక్కుల గోటిచెనకు లేడవి కృష్ణ !, యదిగదా నీ వెఱుంగుదువు రాధ!
సొంపుకన్నుల నిద్రమంపు లేడవి కృష్ణ!, యదిగదా నీ వెఱుంగుదువు రాధ!
కెంపువాతెరఁ బచ్చికెంపు లేడవి కృష్ణ!, యదిగదా నీ వెఱుంగుదువు రాధ!
నునుమేనఁ జిఱుగాజునొక్కు లేడవి కృష్ణ!, యదిగదా నీ వెఱుంగుదువు రాధ!
గీ. నిన్న మొన్నటివాఁడవు నేఁడు చూడ, నేడ నేర్చితి వీమాట లీవు కృష్ణ!
నాకు నాశ్చర్యమైనది నీకుఁ దెల్ప, గూడ దదిగదా నీ వెఱుంగుదువు రాధ! ॥ 98 ॥

క. అని యొండొరు లిటులాడుచు, దినదినముల్ గలసి యొరులు దెలియకయుండన్
గనుమాటి తిరుగుచుందురు, కనఁబడినన్ వారి బొంకుఁ గావింతు రొగిన్. ॥ 99 ॥

సీ. తనమోవి పంటికొద్దిని జుఱుక్కున నొక్క, గినుకతో విదళించుకొని పెనంగుఁ
బెనగినఁ బోనీక బిగికౌగిఁటఁ గదింప, విడువిడు మనుచు నల్లడలం జూచుఁ
జూపువెంబడి నొకించుక నీవిఁ జేనంట, దుడుకు మానవటంచు వెడలబోవుఁ
బోవుచో నొడిసి హా పోకు మంచు దమింప, నొడిపిమ్మట జంటనుండ వెఱచు

గీ. వెఱచి వెఱవని తెగువచే వెడలమఱచు, మఱచి మఱవని తెలివిచే మగుడఁదలచుఁ
దలఁచి తలఁవని తలపుచే దగులుపడుచు, పడుచుదనమునఁ దిరుగుఁ బైబడుచు రాధ. ॥
100 ॥

ఉ. కూరిమిఁ గొన్నినా ళ్ళిటులు గోపసుతుండు చెలంగుచుండి యే
మేర తలంపునంబడెనొ మెల్లన రాధను నిద్రవుచ్చి వా
ర్వారలకెల్లనుం దెలిపి రాతిరి వేకువజామువేళ న
క్రూరుని వెంబడి మధురకుం జని వేడుక నుండె నయ్యెడన్. ॥ 101 ॥

వ. అనిన నవ్వలివృత్తాంతంబుఁ జెప్పు మనుటయు. ॥ 102 ॥

శా. వీక్షామాత్రఫలప్రదప్రళయకావేరీమహాపట్టణా
ధ్యక్షా! శంకరపద్మనాభరఘునాథామాత్యగోపాలకా
దిక్షేమాంకరసోదరాగ్రజపదాత్మీయాఢ్య! వాఙ్మంజరీ
సాక్షాన్నందకుమారపాదయుగపూజాలబ్ధభాగ్యోదయా! ॥ 103 ॥

క. గంధేభగామినీకుచ, గంధాంకితవక్ష! భాగ్యకలితకటాక్షా!
బంధురహయసింధురజయ, బంధురనయకీర్తి! వంశపావనమూర్తీ! ॥ 104 ॥

తరల. మధురభాషణ! మంజుభూషణ! మాన్యసజ్జనపోషణా!
కథితపర్తన! కీర్తినర్తన! కాంక్షితాచ్యుతకీర్తనా!
ప్రథితలక్షణ! బంధురక్షణ! భాగ్యదాయకవీక్షణా!
మథితఘోరవిపక్షసార! విమానితస్థిరభారవీ! ॥ 105 ॥

గద్య. ఇది శ్రీ మద్వేణుగోపాల వరప్రసాదలబ్ధ శృంగార కవిత్వవైభవ
వెలిదిండ్ల తిరువేంగళార్యతనూభవ విద్వజ్జనవిధేయ వేంకట

పతినామధేయ ప్రణీతం బైన రాధామాధవ
సంవాదం బను మహాప్రబంధంబునందు
బ్రథమాశ్వాసము.

శ్రీరస్తు

రాధామాధవసంవాదము

ద్వితీయాశ్వాసము

క. శ్రీమత్సమస్తసద్గుణ, ధామా! రామాభిరామా! తాండవకృష్ణ
స్వామిపదాంబుజదాసా! శ్రీమగదలరామదాస! చిత్రవిలాసా! ॥ 1 ॥

గీ. అవధరింపుము జనకధరాధిపతికి, మదిని సంతోష మొదవ సన్మౌనితిలకుఁ
డైనశుకయోగి రోమాంచితాంగుఁ డగుచు, నవలికథయెల్ల నిట్లని యానతిచ్చె. ॥ 2 ॥

చ. అమరఁగఁ గార్యఖడ్గములయందుఁ బరాకయి రాధికామనో
రమణుఁడు కొన్నినాళ్ళు మధురాపురిలో విహరించి యంత భ
ద్రముగ సముద్రమధ్యమున ద్వారకయన్ పురమున్ ఘటించి రా
జ్యమునకు నాథుఁడై సకలసంపద లందుచు నొప్పె నప్పురిన్. ॥ 3 ॥

గీ. కుల మెల్లను రక్షించెను, దలిదండ్రుల చెఱలు వాపి తాఁ బోషించెన్
భళి! యిఁకఁ దగదె "సుపుత్రః, కులదీపక" యనెడుమాట గోవిందునకున్. ॥ 4 ॥

ఉ. ఏవగవారు చేరిన సహించి తనంతటివారి జేయుచున్
దైవము దాత తల్లియును దండ్రియుఁ దానయి ప్రోవఁగా జగ
త్పావనమూర్తి తవకుఁ బావనమాతను గన్నదేవకీ
దేవినిఁ దన్నుఁగన్న వసుదేవుని నాపదఁ బాపి పోచుటల్. ॥ 5 ॥

మ. పదిరెండేండ్లగు ప్రాయమందు నిటు గోపాలుండు భూపాలురన్
మెదలన్ మీఱఁగనీక లోఁగొనుచు రుక్మిణ్యాదులన్ గన్యలన్
బదియార్వేల వివాహమై సగుణరూపబ్రహ్మమై కన్నవి
న్నదిగా దీమహిమం బటంచు ఘను లెన్నంగాఁ జెలంగెన్ మహిన్. ॥ 6 ॥

క. ఈవగ సమస్తభాగ్యము, కైవసమై నిండియుండఁగా సైఁపక యా
గోవిందుడుఁ రాధపయిన్, భావంబడి కందుఁ గుందు బరవశ మొందున్. ॥ 7 ॥

క. డాయఁడు వనితామణులన్, మూయం డొకగడియమాత్రమును గనుఱెప్పల్
చేయడు చక్కఁగ భోజన, మీయఁడు తనమనసుమర్మ మెవ్వారలకున్. ॥ 8 ॥

సీ. పెనఁగుచో రుక్మిణి మునువలె నీదు మే, నత్త లేదని పల్క వలసినప్పు
కథ దెల్పుమన సత్య గాథరాదని పల్క, నది గాక విననని యసురుసురను
మరుమాట దెల్పు జాంబవతినా నీవల్ల, వింట లేదని నీరు కంటనించు
రతివేళఁ గాళింది నుతియించుచును నాథ, రాయనఁ గ్రైవ్రాలు హా యటంచు
గీ. బలిమిఁ బడఁతులు పైఁబ్రక్కఁ బడెడువేళ, నొడువుమాటలవ్యంగ్యముల్ దడబడుటలు
చదురులను సంధినేర్పులు వెదకిచూడ, రాధ తలఁ పైన మదిగుందు మాధవుండు. ॥ 9 ॥

చ. పయికొని పువ్వుఁబోఁడ్ల బహుభంగులఁ బ్రార్థన చేసి వేడినం
గయికొనఁడాయె శౌరి తమఁ గానక రాధిక యెంతయుబ్బసం
బయిపొరలాడునో యనుచు నాత్మను జింతలు నెట్టివారికిన్
దయ యొకచోట నుండిన వితావిత యెంతవివేక ముండినన్. ॥ 10 ॥

చ. ఒకరికిఁ దెల్పరాదనుచు నూరక చింతిలుఁ గొంతసేపు కా
దొకరికిఁ దెల్ప మంచిదని యుద్ధవుతోఁ దెలుపంగఁబోవు నే
నొకరికిఁ దెల్ప రాధ యిటు లొక్కరి కేటికిఁ దెల్పెనంచుఁ దాఁ
దకపికలాడునంచు మదిఁ దాలిమి వీడును వేఁడు దైవమున్. ॥ 11 ॥

వ. ఇవ్విధంబున బహువ్యథలం బొందుచు నెందునుం బ్రొద్దుపోక దేవకీనందనుండు తన
ప్రాణసఖుండగు నుద్ధవుని కైదండఁ గొని మందమందచరన్మలయపవమానకంపితాభంగ
భంగనటత్కలక్వణితరణితకలహంసకారండవప్రముఖపత్త్రికులగోత్త్రకులపత్త్ర
వాతోద్ధూతాంబుజాతజాతపరాగరాగకషాయితకషాయకాసారరంగత్తరంగ
కణోద్ధూతజలకణపరంపరాపరితోషితమందారమాకందచందనపిచుమంద
కుందసిందువారతాలహితాలతమాలమాలతీతక్కోలసాలరసాలజంబుజంబీరఖర్జూర
కరవీరసహకారపున్నాగనాగవల్లీమల్లికాపుంజరంజితనికుంజపుంజమంజులవివిధ
కుసుమభాసురవాసనాభిరామం బగు నొక్కకేళికారామంబుఁ జేరి యందు
నింద్రనీలసాంద్రకుట్టిమప్రాంతప్రవాళస్తంభసంభూతకాంతివిభ్రాజితజాతరూప
మయకుడ్యనిబద్ధపద్మరాగచ్ఛవిచ్ఛన్నమరకతలాపయుక్తముక్తావితానవిలాస
వాసచతుష్కిరాంగణకాంతశశికాంతిశిమయవేదికాతలంబునఁ గూర్చుండి
కొండొకవడి యూరకుండి నలుదిక్కులుం గనుంగొని యుద్ధవుం డాయరమ్మని
యీమర్మం బెన్నఁడేనియు నీవు వినియుందువే యని గోవిందుండు మందహాస
భాసురముఖారవిందుండై యిట్లనియె. ॥ 12 ॥

ఉ. ఇద్దరకెల్ల రాజనయి యెక్కడలేని ప్రసిద్ధి గాంచి నా
బుద్ధికి నీడు లేదనగఁ బొల్పు వహించి తలంప నేమిటన్
బద్ధుఁడఁ గాక యుంటిఁగద ప్రౌఢతకెల్లను వెల్తిగాఁగ నో
యుద్ధవ పిన్ననాటితగు లొక్కటి గల్గె జగద్విరుద్ధమై. ॥ 13 ॥

క. పడుచుదనంబున గొల్లల, పడుచులతో నాడునాఁడు పైనిన్ బ్రక్కన్
బడుచు న్నందునిచెల్లెలిఁ, బడుచున్ గైకొంటి మోహపడుచున్ వేడ్కన్. ॥ 14 ॥

గీ. పిన్ననాటనుఁడి ప్రేమ నెందఱతోడ, గూడలేదు? కూడి వీడలేదు?
దాని మఱతుననిన ధైర్యంబు రా దది, రాధ గాను ధృతివిరోధి గాని. ॥ 15 ॥

ఉ. తల్లికిఁ దండ్రి కన్నలకుఁ దమ్ములకున్ దెలుపంగ రాని నా
యుల్లముగుట్టు గోప్య మిపు డుద్ధవ నీకు వచింతు రాధ కే
నల్లుడ నంచు రాధ మఱి యత్త యటంచుఁ బ్రసిద్ధి యుండగాఁ
జల్లుగ మాకు నిద్దరకుఁ జేరిక యేగతిఁ గల్గుఁ జెప్పుమా. ॥ 16 ॥

చ. గమకముతోడ నొక్కపని గ్రక్కునఁ జేసినచో రహస్యమై
యమరదు మున్నె కొంత గొఱయైనది శౌరి స్వతంత్రవాది; వే
దమును మతంబు శాస్త్రమును దైవము లేదని లోక మెంచు; లో
కమున వివేకి లేఁడొకడు కాముకధర్మము లూహ సేయఁగన్. ॥ 17 ॥

ఉ. ఆరును దూఱునుం బడియు నాచెలి యేమిటికంటివేని నే
వీరును వారునుం బలెను వెట్టిదయన్ వలపింపలేదు శృం
గారరసప్రభావములు కన్నియ నా కుపదేశ మీయఁగా
నేరిచినాఁడ దాని విడనేర్తునె నేర్చిన వైన మోర్చునే. ॥ 18 ॥

గీ. చక్కదనమెల్ల రాసిగాఁ జక్కఁద్రోసి, కమ్మకస్తూరి మేదించి కరగఁబోసి
చేసినాఁడేమొ పరమేష్ఠి చేతివాసి, డాసి మెచ్చఁడె చెలిన సన్యాసియైన. ‖ 19 ‖

గీ. భూమి రామలమోములపోల్కి యనుచుఁ, దామరల నెంతు రే నట్టితామరలనె
చెలియపాదంబులకు సాటి సేయఁగూడ, దందు రాజకరస్పర్శ మందలేమి. ‖ 20 ‖

గీ. కమలగర్భంబులఁ దృణంబు గాఁగఁ జూచి, పొలుచుకాహళ లూదుకపోవు ననినఁ
బొలఁతిజంఘలతో సరిపోల్ప నగునె, జనులమఱుఁగున దాఁగెడిదొవల నెందు. ‖ 21 ‖

గీ. ఆకృతికి రంభ యనికదా లోకరూఢి, యెట్టిరంభలనైన నయ్యిందువదన
తొడలనగఁజాలు నినచో గడమ కేమి, యతివ నెంచంగఁ దరమె బ్రహ్మాదులకును. ‖ 22 ‖

క. ఉన్నవె సాటువ లెన్నఁగఁ, గన్నియపిఱుఁ దంద మింకఁ గౌ నందంబున్
మన్నును మిన్నును గలిగిన, యన్నాళ్లకు మఱవవచ్చునా చెలికాఁడా. ‖ 23 ‖

క. ధరఁ గవులు పక్షపాతము, గ రచింతు రదేమొ గాని గతులకు సరులా
కరులును; గిరులును సరులా, గురుకుచముల; కెఱుఁగలేరు గుణసామ్యంబుల్. ‖ 24 ‖

క. వచియించను రచియించను, బవరించ గణించఁ బంచబాణునితరమా
కచమేచకచకచకరుచి, కుచలికుచమరీచిలికుచమకుచకే తగుటన్. ‖ 25 ‖

ఆ. క్రోల బుద్ధిగొల్పు కొమ్మవాతెరతోడఁ, బండియున్న దొండపండు సరియె?
చేరెఁడేసికన్ను లారసి యిసుమంత, తమ్మిరేకు లనఁగ ధర్మ మగునె. ‖ 26 ‖

క. కోమలిమోమున కాహిమ, ధాముఁడు సరిగాడటన్నఁ దామర సమమా
తామర సమమొనప్పుడు, తామరసము గాక తనయథాస్థితి నున్నన్. ‖ 27 ‖

క. ఏయెడ నఖశిఖవర్ణన, సేయంగా నొకరివశమె ; శేషుఁడు రాధన్
బాయక వేణినెపంబై, వేయేటికిఁ దెలియ లేక వ్రేలుచునుండున్. ‖ 28 ‖

క. ఆనగుమో మాకనుఁగవ, యానడు మామొవితీరు నాచనుఁగవని
క్కానడగు ల్కాతొడతత, ళ్కానీటును మఱవవచ్చునా చెలికాఁడా. ‖ 29 ‖

సీ. అల్లుఁడా రమ్మని యలరించు నొకవేళ, హొయలుగాఁ గైసేయు నొక్కవేళ
దుడుకు చేసినను బుద్ధులు దెల్పు నొకవేళ, మక్కువ ముద్దిచ్చు నొక్కవేళ
కన్నెలతో నాడ గద్దించు నొకవేళ, నొంటిగాఁ జదివించు నొక్కవేళ
తచ్చనమాటలఁ దర్కించు నొకవేళ, నూరక నవ్వించు నొక్కవేళ
గీ. వలచు నొకవేళ నొకవేళ వద్దఁ జేరుఁ, బలుకు నొకవేళ నొకవేళఁ బల్కకుండుఁ
బెనఁగు నొకవేళ నొకవేళఁ బ్రేమఁ గలియు, నలుగు నొకవేళ నొకవేళ నాదరించు. ‖ 30 ‖

క. ఆనాతిమనసుమర్మము, లే నెఱుఁగుదు నాదుమర్మ మెఱుఁగును రాధా
మానవతి లోకు లెవ్వరుఁ, గానరు మామనసుమర్మకర్మము లరయన్. ‖ 31 ‖

చ. తనమనుగోటితాఁకులకుఁ దాళిన నెవ్వతెపైఁ బరాకు నీ
కని యొకకిన్కఁ దెచ్చుకొని యవ్వలిమోమయి మోడిసేయుఁ గా
దని విదళించినన్ సయిప దాయనె నేఁడని చిన్నవోవు యెం
తని వచియింతుఁ గంచుపద నాచెలినెమ్మన మెంచ నుద్ధవా. ‖ 32 ‖

చ. సికనునుగోళ్ల దువ్వుచును జెక్కిలి నొక్కుచు నేమియే నొకా
నొకథ బూతుగాఁ దెలుప నూకొన కేను బరాకుగా, బకా
పక నగి యేలరా వినవు పాపఁడ! యింతనె యింతవింతయే

రక మనుముచ్చటల్ మఱపురా విఁక రాధిక నెట్లు వాయుదున్. ॥ 33 ॥

శా. రారా కృష్ణుఁడ రాఁగదోయి వరదా, రావయ్య గోపాలకా,
యేరా చుంబన మీఁగదోయిఁ యధరం బీవయ్య నీయాగడం
బేరా, కోప మదేలనోయిఁ యలిగే వేమయ్య, మాటాకరా,
“రారా ర” మ్మని పిల్చు, నెట్లు మఱతున్ రాధావధూటీమణిన్. ॥ 34 ॥

ఉ. చక్కనిరూపుతోఁ గలికి జగ్గున నిల్చినయట్ల నిల్చి తా
నిక్కముగాఁగ నన్నుఁ గరుణించుచుఁ జూచినయట్ల చూచి తాఁ
బక్కున నవ్వినట్ల నగి పైకొనఁగా గమకించినట్ల నల్
దిక్కులఁ గాననయ్యెడి మదిం దిగులయ్యెడిఁ దెల్పబోయినన్. ॥ 35 ॥

క. ఆకామిని యటు నే నిటు, “కాకః కాకః పికః పికః” యటన్నవిధం
బై కవఁబాయఁగవలసెఁ బ, రాకా నావంకఁ జూడరా చెలికాఁడా. ॥ 36 ॥

గీ. ఇఁక నశక్తునిరీతిని నేఁ దపింప, నొకఁడు కరుణింపనున్నాఁడె యుర్విలోన
మనము వేకువ ప్రేపల్లెదనుకఁ బోవ, వలయు నీవును బైనమై నిలువు మనిన. ॥ 37 ॥

క. ఇది మంచి దనుచు నుద్ధవుఁ, డెదఁ బొదలుచు మాట నుబ్బనియ్యక యంతన్
బోవలె నట రుక్మిణీమణి, యుదుటుం బడుచులయెలుంగు లొగి వినఁబడఁగన్. ॥ 38 ॥

క. మనమాటలు వినరుగదా, యని కొంకుచుఁ గృష్ణుఁ డుద్ధవా చూచితివే
యినుఁ డస్తమించు వైఖగి, మనలం గని డాఁగఁబోవు మహిమ చెలంగన్. ॥ 39 ॥

క. దిగవిడిచి లోకబాంధవ, తగవే నీవేఁగ మనకుఁ దా నిది మేలా
పగలాయె ననుచుఁ బద్మిని, మొగిచినకే లనఁగఁ బద్మములు ముకుళించెన్. ॥ 40 ॥

చ. పొడుచుట యాదిగా దనుజపుంజములం దెగటార్చి యార్చి తా
వడిఁ జరమాగ దానవుని పైఁబడి నాతపనుండు గ్రుంక వెం
బడి జగ మెల్లనున్ బొడువఁ బైకొనుచీఁకటి సోఁకుమూఁకచే
నదరుతుపాకిత్రాటి కొడియగ్గి యనం బొడసూపెఁ దారకల్. ॥ 41 ॥

క. మడిగొన్న కటికచీఁకటి, కెడచూపక దీపకళిక లిండ్లఁ జెలంగెన్
వడిఁ దేంట్ల నంటనీయక, పొడసూపినకనరముకుళము లనగ మిగులన్. ॥ 42 ॥

వ. అని యివ్విధంబున నవ్వనజనాభుండు గొన్నిప్రొద్దుపోకమాట లాడుచు, బెండ్లి
చవికలోనికిఁ జని యుద్ధవునిం బనిచి రుక్మిణీకేళికాగృహంబునకుం బోయి తదను
గుణప్రియభాషణంబుల సంతోషంబు సేయుచుఁ దనపయినంబునకు నుపాయంబు
గానక నెపంబు వెదకుచు మనంబున ఘనంబగు పరితాపంబునఁ బొరలుచుండె నంత
నక్కడ. ॥ 43 ॥

క. తను నిదురఁబుచ్చి వేకువ, వనరుహనయనుండు చనినవార్త చిలుకచే
వెనుకన్ విని యారాధిక, ఘనతరశోకాబ్ధి మునిగి కళవళపడుచున్. ॥ 44 ॥

సీ. ఒకరిఁ బిల్వఁగఁబోయి యొకరిపేరునఁ బిల్చు, నమ్మచెల్ల! యటంచు హరిఁ దలంచు
నొకటిఁ జూడఁగఁబోయి యొకటిఁ దప్పక చూచుఁ, దప్పగ యిదియంచుఁ దనుగణించు
నొకటి సేయఁగబోయి యొకప్రయత్నము చేయు, మంచిదాన నటంచు మదిఁ దలంచు
నొకటి పల్కఁబోయి యొకటి యేమేఁ బల్కు, మోసమాయె నటంచు మోమువంచు
గీ. మారు నిందించునదె తోఁచె శౌరియంచు, బయలు గబళించుఁ బలవించుఁ బల్కరించు
నిజము గాదంచుఁ గన్నుల నీరు నించుఁ, గలకలనుముందుఁ గలయించుఁ గలువరించు. ॥ 45
॥

గీ. బయలు వెడలంగఁజాలదు భయముచేత, నిముడుకొనియుండఁజాలదు భ్రమముచేతఁ
గలికి యపు డోదమున బడ్డకరిణికరిణిఁ, దొట్రుపడి కొట్టుకాడును ద్రొక్కులాడు. || 46 ||

సీ. మధుకైటభారాతి మధురవాచారీతి, నొంటిగాఁ జింతించు నొక్కవేళ
హాటకాంబకధారి యదెవచ్చె నని చేరి, యున్నట్ల బయలాను నొక్కవేళ
పాథోధిశాయిపైఁ బదము పాడగబోయి, యూర కేదో గొణఁగు నొక్కవేళ
మనమునఁ బెనఁగొన్న మర్మకర్మములకు, నుడుకుచు వెతనొందు నొక్కవేళ
గీ. దిక్కులేదని విధి దూఱు నొక్కవేళ, మ్రొక్కి దయఁజూడుమని వేఁడు నొక్కవేళ
నోయదూద్వహ యని చీరు నొక్కవేళఁ, దా మది కలంగి రాధికాకోమలాంగి. || 47 ||

గీ. మఱియు నొకయింత శయ్యపై మఱవులేక, బాధ పడి రాధ తడఁబడి బడలి నిల్చి
పిల్చి హాయనతాఁ బ్రలాపింపఁదొడఁగెఁ, గృష్ణు వటు గూర్చి చెక్కునఁ గేలు చేర్చి. || 48 ||

క. హా కృష్ణ! హా యదూద్వహ!, హా కేశవ హా ముకుంద! హా గోవిందా!
హా కమలనయన! హా హరి!, హా కమలాహృదయలోల! హా గోపాలా! || 49 ||

మ. నిను నాదైవముగా మదిం దలఁతు నీనిద్దంపునెమ్మేను నీ
గొనబుంజెక్కులు నీసుధాధరము నీగోమైన నెమ్మోమునుం
గని యుప్పొంగుచు నాతపఃఫలముగాఁ గైకొందు నేఁ డయ్యయో
నను నేలా గెడఁ బాయఁజాలితివి కృష్ణా ! యెంత నిర్మోహివో. || 50 ||

మ. ఒకనాఁ డించుక చూడకున్న నిను నాఁ డూరెల్ల నేమేమొ కం
టికి నిస్సారము గాఁగఁ గానఁబడు; నా డెందంబు నిన్ జూచినం
దుకె ముల్లోకముఁ దానె యేలుగతి నెందున్ సంతసంబందు; నేఁ
డకటా యేమియు లేక నీవు ననుఁ గృష్ణా! యింత గాఁ జేయుదే. || 51 ||

ఉ. అక్కట యెన్నిముచ్చటల కాసపడుంటి మనంబులోనఁ దా
నొక్కటి యెంచ దైవ మదియెక్కటి యెంచుట సత్యమాయె; నీ
యక్కునఁ జెక్కుఁ జేర్చుకొననైతిని, నా కిది మోసమాయె న
న్నిక్కము పాయకుందువని ని న్నెద నమ్మితిరా మనోహరా. || 52 ||

చ. కదియక సీమవారివలెఁ గన్నులఁ జూచినవేళఁ గొంతసే
పది యిది ప్రొద్దుపోకలవిహారము సల్పిన నింత రాదుగా
మొదలనె దూర మెంచవలె మోసము వచ్చె నిఁ కేమి సేతు హా
మది మదినుండి యేల నిను మాలిమి చేసితి జీవితేశ్వరా. || 53 ||

క. ఆసించి నీవు చేసిన, బాసల కే నమ్మియున్న పసిగోల నయో
దోస మన కింతలో మది, రోసితి వింతటిదయాపరుండవొ కృష్ణా. || 54 ||

చ. అని విలపించి నీవు విడనాడిన నెవ్వరిదాననంచుఁ గా
మిని మొగమందు చేల యిడి మెల్లనె యేడ్చెను వెక్కి వెక్కి వా
ల్లనుఁగవ వెచ్చనీరు చిఱుకాలువలై ఱయికంటి నిక్కుచ
న్గొనలను జాఱఁగా మెయి గగుర్పొడువన్ మది తాల్మి వీడఁగన్. || 55 ||

గీ. అంతఁ బెంపుడుచిల్కఁ యయ్యతివఁ జేరి, యక్క యది యేమి చేసెద వళుకుదీరి
చెలులు వినియెద రెందుకే చింతఁగుంద, వలదు కృష్ణునిపదమాన నిలువు మనిన. || 56 ||

క. కనువిచ్చి చూచి రాధిక, తనువేఁడెడుచిలుకతోడఁ దా నిట్లనియెన్
వినవే చిలుకా కృష్ణుఁడు, తనునొల్లని వెనుక నాదుతను వేమిటికే. || 57 ||

క. ఇ ల్లేటికి మగఁ డేటికిఁ, ద ల్లేటికిఁ దండ్రి యేల ధన మేటికి నా

యల్లునిరూపము కన్నులు, చల్లనఁగాఁ జూడఁగనినఁ జాలదె చిలుకా. ॥ 58 ॥

చ. కల్లరి గాఁడు లో నెనరు గల్గినవాఁ డదిగాక వావి మే
నల్లుడు రూపవంతుడు మహాగుణశాలియటంచు నమ్మి నా
తల్లిని దండ్రినిన్ మగని దమ్ముల నన్నల రోసి తన్ను నే
నుల్లములోని దేవు డనియున్నది కీరమ నీ వెఱుంగవే. ॥ 59 ॥

ఉ. వీథులలోన లేవగవు వెన్నెల చల్లఁగఁ గాయఁ బూర్ణచం
ద్రోదయమైనరీతిఁ గళలూనినవానిమొగం బెగాదిగ
న్నాదిగులెల్లఁ దీఱఁ గని నాదిగదా తగుభాగ్య మౌర నా
మీఁదను స్వామి కెంతదయ మేలుభళా యనుకొందుఁ గీరమా. ॥ 60 ॥

గీ. చందురుని జూచి సంతోష మందులీల, జూచి పొంగుదు హరి నది చూడలేక
యమ్మలక్కలు మిన్నక యాడుకొందు, రేల కొఱయైతి నిందుల నేమిగంటి. ॥ 61 ॥

చ. చలమున మచ్చుచల్లిన నిజాలకునున్ దయ వాఁడటంచు నే
వలచితిఁ గేతకీకుసుమవాసనకై భ్రమనొంది తేనె లో
పలఁ గలదంచు నాసఁగొని పైఁబడఁ బుప్పొడి రెండుకన్నులం
దొలసిన లేవలేక పడుతుమ్మెదతో సరియైతిఁ గీరమా. ॥ 62 ॥

చ. మది మది నుండలేక బతిమాలిన నామది నాడికొందునో,
కొరవలు గాఁగ నాడుకొనుగుంపుల నందునొ, యింత కోర్చు నా
బ్రదుకున కందునో, వెతలఁ బాల్పడజేసిన బ్రహ్మ నందునో,
యది యిది యేల నావలపు లాఱడిఁబెట్టిన శౌరి నందునో. ॥ 63 ॥

ఉ. ఎన్నిటికంచు నే వగతు నిప్పుడు నాతలవ్రాత యేమి గా
నున్నదొ యింతఱంకుపడ నోర్చినదానికి నెంతచందఁగా
నున్నదొ కానిపోనితగు లూనిన నామది కేమి సేతుఁ గా
నున్నది కాకపోవదని యుందునె యుండదు నెమ్మనం బిఁకన్. ॥ 64 ॥

మ. అనుకోరాదనికాక యోచిలుక! నా కాశౌరి యూరెల్ల హో
యనుకాలంబున నే ఫలం బొసఁగి యన్యాధీనతం జెంది నేఁ
దనుఁ బ్రార్థించిన కొద్దిఁ దాబిగియ వంతం జింత నంతంత యిం
తనఁగా రానివిరాళిపాలుపడి లోనైయుంటి నన్నింటికిన్. ॥ 65 ॥

క. నేఁడైన వానియాసల, పోఁడిమి విడనాడి నేను పొలిసెదనన్నన్
వాఁడి చెడినాఁడు మారుం, డాడు నితని కేల పువ్వుటమ్ములు విండ్లున్. ॥ 66 ॥

చ. అనుచు ననంగునిం గుఱిచి యంగనలన్ మము నొంపఁ గాని పెం
పను గొఱగావు నీయొడలు భస్మముగా మగవారిఁ జేరనుం
జెనకఁగలావె లావుగలచిల్కగుఱాని బిరాను జేరి సి
గ్గున బ్రదుకందలంపు మదిగో యిఁక నెన్నకు బంటుపంతముల్. ॥ 67 ॥

క. దమయంతి రామునింతిని, బ్రమయించినరీతి వట్టిభ్రాంతిని నన్నుం
దమి ముంచకు మరు లెంచకు, కుమిలించకు పువ్వుటమ్ముఁ గుదిలించ కెదన్. ॥ 68 ॥

గీ. అని యనంగుఁడ వీవు ని న్ననఁగ నేమి, నేమిరీతిని నెలదోఁచె నింగి నిందు
నిందుఁ బగఁజూడు మని మళ్ళి తీవు గాక, కాఁక నను ముంచలేవని కలికి యనియె. ॥ 69 ॥

సీ. పశ్చిమాచలము పైఁబడి మళ్ళి బ్రతుకుదే, లలిఁ జూపు నింద్రజాలంబు గాక
యిలఁ జకోరములు వెన్నెలఁ గ్రోల నెగడుదే, వగఁజూపు కరలాఘవంబు గాక

దినదిన మొకవింతతీరుగాఁ దోఁచెదే, వెడచూపు బహురూపవిద్య గాక
రాహువు మ్రింగఁ గోఱలు సోకి వెడలుదే, వెడవెడఁజూపు గారడము గాక
గీ. నల్లనైయున్న జగ మెల్లఁ దెల్లఁజేసి, భ్రమల ముంతువె కనుకట్టుబలిమి గాక
కాక యేపాటి నిజరీతి ఘనుడవైతి, నేఁడు గాదోరి నీదారి నీరజారి. ॥ 70 ॥

ఉ. ఆననవింటివాని మది నల్లునిగా నెఱనమ్మినావు; లో
కానఁ గుమారుఁడు జనకు కైవడి నౌగద; మేనమామగం
డాన జనించినాడని వినంబడెఁ దండ్రిని మించినాడుకు ద్రో
హానకు నింకనైనను మృగాంక మృగాంకునిఁ జేరు మూరకన్. ॥ 71 ॥

క. కాదేని నీదువెన్నెల, వేదన నామీఁద జూపి విను ప్రాణములన్
లేదనిపించును పంతము, లేదా యల్లునికిఁ దోడు లే లెమ్ము వడిన్. ॥ 72 ॥

వ. అని యారాధావధూతిలకంబు తలపెంపుడుచిలుకం బేర్కొని. ॥ 73 ॥

చ. ననవిలుకాఁడు బోయ; నెల నా కలదాయ; యిదేల వీరిబా
ధను బడఁజాల; జాణవుగదా చిలుకా, యొక గాథ లేదుగా
యన “విను సన్నుతాంగి తెలియంగ ననంగ నవంగ నొక్కరా”
జన వాని యంతఁ గేల జెవు లల్లన మూయును నీశ్వరా యనున్. ॥ 74 ॥

క. ఇవ్వగల రాధికామణి, నెవ్వగలం బొగులఁ జిలుక నేర్పునఁ బలికెన్
జవ్వని మీగోపాలుని, నవ్వుచు నేఁ దోడితెత్తు నన్నంపవుగా. ॥ 75 ॥

గీ. ఆఱునెల లాయెఁ గృష్ణుఁ డందరిగి యిపుడు, సకియ రాకున్నె పిలిచిన జాలుఁ గాని
బ్రమసి వెదకెదుగాక నీ పతిమనంబు, కదలకున్నది నీచెంతఁ గంటి నేను. ॥ 76 ॥

వ. అనిన విని నవ్వి యవ్విలాసినీతిలకం బిట్లనియె. ॥ 77 ॥

చ. వలచినవారు లేరొ, సరివారలలో నగుబాటు గాఁగ నా
వలెఁ జరియించిరే యొకరివంతుల కేటికి బోవ, దాత నా
తల నిటు వ్రాయఁగావలెనె; దైవము దూఱఁగ నాయమౌనె; నే
దొలిమెయి నేమినోము లెటునోచితినో యిది గంటి నిమ్మెయిన్. ॥ 78 ॥

ఉ. కంటికి నిద్రరాదు చిలుకా! కలకాలము వేగఁజాల నీ
వంటియనుంగుఁ గల్గి తగవా మగవారలఁ బాసియుండ నే
నొంటిగ నుండి ని న్ననుపనోప; నయో యిటు లేల జాగు; నీ
వెంటనె జంట చేసికొనవే; పదవే వనమాలిపాలికిన్. ॥ 79 ॥

క. నీకుం గలిగినఱెక్కలు, నా కమరకపోయెఁగాక; నా కబ్బినచోఁ
బైకెగసి యిందిరారమ, ణీకాంతునిఱొమ్ముమీఁద నిలువనె చిలుకా! ॥ 80 ॥

క. పొ మ్మనవలె; న న్నియెడఁ, బొమ్మనవలె; నీవు పోయి పురుషోత్తముతో
ర మ్మనవలె; దేహము నీ, సొ మ్మనవలె; విడువవలదు సు మ్మనవలయున్. ॥ 81 ॥

మ. తను భోగింతుఁ, దను న్వరింతు ననుచింతం గాదు పో యింక నా
పని నాకేటికి; సిగ్గులేదె తొలుతన్ బ్రాయిండి యిల్లాలిఁ గా
పునుగాఁ జేసి తుదిన్ ద్యజించి తిరిగే పుణ్యాత్ములం జూచినం
తనె చాలున్ ఫల; మీశ్వరేచ్ఛ యెటులైనం గాని యామీదటన్. ॥ 82 ॥

మ. తన పేరుం దనపల్కులుం దనవగల్ తా నాయెడం జేయుమ
న్ననయు న్నెమ్మది నాఁటియున్న దిఁక మానంచాలఁ జింతాభరం

బున డెందంబున కొక్కటన్ విరసమున్ బుట్టించి పోఁ గాని ర
మ్మనవే యొల్లనివాని కేల యితనివ్యాపారచాతుర్యముల్. || 83 ||

ఉ. ఇంగిత మెల్లనుం దెలియ నెంతయు జాణవు నీవు; నీవచ
స్సంగతి యేరికిం గలదె; సన్నుతి గా దిది శౌరి నేను ను
ప్పొంగుచుఁ గూడినప్పటికి బొల్పుగఁ దోఁచును నిన్ను మెచ్చఁగా
బంగరుచిల్క; నిన్నిపుడు పల్కఁగ నేర్తునె పేదపల్కులన్. || 84 ||

గీ. అనుచుఁ దనచేతివ్రాలఁ బద్యములు రెండు, వడిగ లిఖియించి ఱెక్కలనడుమ నునిచి
చిల్క నేనేమి దెల్ప నీచిత్త మిఁకను, దనదుభాగ్యము పోయిరమ్మనుచు ననుప. || 85 ||

క. గగనమున కెగసి మథురా, నగరముఁ గని యచటఁ గమలనాభుఁడు లేమిన్
దగఁ దెలిసి ద్వారకాపురి, డిగి యచ్చటినగరు సొచ్చి డెందం బలరన్. || 86 ||

క. తమకమున భోజకన్యయుఁ, గమలాక్షుఁడుఁ బడుకటింటఁ గవగొని యుండన్
సమయము గాదని యచ్చట, నమరినచిలుకలను గూడి యాడుచు నుండెన్. || 87 ||

వ. అంత. || 88 ||

మ. తళుకుదంతపుఁజెక్కడంపుఁబనినిద్రాజాళువాకీలుబొ.
మ్మలు నల్వంకల మాడిగంపునడగుమ్మల్ గాఁ ‘బనుల్ సేయఁగాఁ
గులుకుంబచ్చులకోళ్లమంచముపయిన్ గోపాలుఁ డారుక్మిణీ
లలనారత్నముతోడిఁ గూడి పొలయల్కన్ మార్మోగం బౌనెడన్. || 89 ||

మ. చిలుకం జూచి బిరాన లేచి నగుచున్ జేసాచి రా రమ్ము ము
ద్దులగారాబుమిటారిచిల్క యన నెంతో వేగఁ బాదాంబుజం
బులపై వ్రాలఁగ గేలిపైఁ దిగిచి యింపుల్ గుల్క ముద్దిచ్చి ఱె
క్కలఁ జక్కంబడదువ్వుచు న్నిజదృఢాంకంబందు లాలించుచున్. || 90 ||

క. నందయశోదలు పరమానందంబున నున్నవారె?, నన్ దలఁచెదరే
యందలిమనవారందఱు?, గొందఱు నన్నెపుడు దూఱుకొందురె కినుకన్? || 91 ||

ఆ. పిన్ననాఁటనుండి నిన్నుఁ బ్రాణంబుగాఁ, బెంచుకొన్నరాధ యించుకంత
తడవు వీడఁజాల దెడఁబాసి వచ్చుటఁ, జింతసేయ నేదొ వింతే కలదు. || 92 ||

క. అని వనజాయతలోచనుఁ, డన విని యింతంత గాని యానందముతో
నెన రింత లేకయుండినఁ, జన నగునే యనుచు మదిని సంభ్రమ మొప్పన్. || 93 ||

ఉ. ఓసుగుణాభిరామ పురుషోత్తమ దేవరవారు పూర్ణసిం
హాసనపట్టభద్రబిరుదాంకమహోన్నతులై భవత్పద
వ్యాసలసత్కిరీటవసుధాధిపకన్యక లూడిగంబు లా
సాసలఁ జేయనుంటఁ గనినంతకు వింత మ ఱేమీ కల్గెడిన్. || 94 ||

ఉ. అన్నియు నుద్ధరించెదనటంచు నటించినదాని కేమిపో
యె న్నెల కొక్కసారి మొగ మించుక చూపినఁ జాలు నేల యీ
యెన్నిక లంచుఁ గొందఱు నిజేచ్ఛల దూఱుటదక్క నెవ్వరున్
ని న్నొకపాటివాఁడని గణించెదరే యదువంశభూషణా. || 95 ||

వ. అని పలికిన. || 96 ||

క. ఇమ్మాటలు మఱి మఱి విన, ముమ్మరమై తనదుచెవికి ములుకులు గాగా

ముమ్మడి నలుమడి కోపము నెమ్మదిలో బొడమ రుక్మిణీమణి యంతన్. ‖ 97 ‖

ఉ. జాటినకొప్పుతో జెవికి జాటినపాపటబొట్టుతో దిగం
జాటినపైటతో నొఱగజాటిననీవికతో నొకింతగా
జాటినసొమ్ముతో జెమట జాటినకస్తురిబొట్టుతో ముడిం
జాటినపూలతో నొడలు జగ్గుమనన్ వడి లేచి దిగ్గునన్. ‖ 98 ‖

గీ. లేచి తనబోంట్లమీదను లేనికోప, ముంచి గుప్పించి పిలిచి గద్దించుకొనుచు
సైగగా బోవ దన కది సైగ గాగ, శౌరి ముసిముసినగవుతో నూరకుండె. ‖ 99 ‖

గీ. చిలుకకడ జూచి నీ కేల చిన్నవోవ?, నెంత లేదిది; నీకు బ నేమి; యొకరి
ప్రకృతి గాదని మాన్పంగ కొకరివశమె?, చెలియ యేమనె నవ్వాల దెలుపు మనిన. ‖ 100 ‖

చ. చెలియ కి కేమియున్నవి విశేషము లయ్యెడ నెన్న మాటికిన్
దెలుపగ వేసటయ్యె జెలిదీనత జూచిన గృష్ణ కృష్ణ; యా
పొలతుక యేమిభాగ్యములు పొందెడినో తెలియంగరాదు; వే
డ్కల గనియైన నీదుసముఖంబున దెల్పగరాదు తద్వ్యథల్. ‖ 101 ‖

మ. ఘనయోగీంద్రునిరీతి నేమి వినినన్; కందోయిఁ దా నేమిగ
న్నను; నెమ్మేనున నేమి సోఁకినను; గృష్ణా! దేవకీనందనా!
యని పల్కున్; జెలిప్రేమ నేమనుదు నాహా! మోహ మోహోహో; నె
మ్మన మౌరౌర; వికార మంచినదిరా మందారపుష్పాకృతిన్. ‖ 102 ‖

క. ఆపడఁతిచేతఁ బెరిఁగిన, పాపంబున నాదుపల్కు ప్రత్యక్షము గా
మోప దయిన నీసేవలు, ప్రాపించుటఁ గొంతకొంత పాటింపఁదగున్. ‖ 103 ‖

చ. ఘనకుచపాళి హాళి నినుఁ గస్తురిచేఁ గొనగోట వ్రాసి యి
య్యనువున నెన్నఁ డుందు నకటా యనుచున్ దలపోసి పోసి వె
చ్చనికనునీరు పై పయిని జాఱఁ గరంటుల నాని చే చుఱు
క్కున విదళించి యెంత ఘనమాయెను జీవమటంచుఁ జింతిలున్. ‖ 104 ‖

క. వక్కమ్మలోన నేమో, గ్రక్కునఁ దా వ్రాసి యొసఁగెఁ గైకొను మనుచున్
ఱెక్కల నుంచినపత్త్రిక, ముక్కున నెడలించి శౌరిముంగల నిడియెన్. ‖ 105 ‖

క. పురుషోత్తముఁ డాపత్త్రిక, నిరుకేల వహించి మొదల నీయ వటంచున్
మురియుచు గన్నుల నొత్తుచుఁ, దఱచుగ దల యూచి చదివె దా నిట్లనుచున్. ‖ 106 ‖

చ. సకలగుణాభిరాముఁ డగుశౌరికి రాధ నమస్కరించి మి
న్నక యొకవిన్నపంబు; నిను నమ్మినవన్నియునున్ ఫలించె న
త్తకు మగఁ డల్లు డంచును వితావిత తేరకుఁ దేర వట్టియా
డిక లివి యేల నాకు నెగడెన్ వడి మాన్పుము మేలు నీకగున్. ‖ 107 ‖

వ. అని చదువుకొని తద్భావంబులు పలుదెఱంగులం బరికించి వాత్సల్యంబును ముగ్ధ
తనమును బ్రౌఢతనమును వ్యంగ్యంబుగఁ దోప వింతయుఁ జింతయు దొంతరగా
నంతరంగంబునం గదురఁ గొంతవడి యూరకుండి యవ్వలం గనుంగొని యందు. ‖ 108 ‖

క. ... ... నిను మది మఱవను
... ... నను నెనరు మఱచి కినియకు నాపై
... ... కనికర ముంచర
... ... యని తలఁచినపుడె యెనసెద ననరా. ‖ 109 ‖
(ఇది గుప్తచతుష్పాదకందము.)

వ. అని చదువుకొని యది గణబద్ధం బయ్యును బద్యంబు గానివిధం బేమి యని యూ
హించి యస్మన్నామంబు ముందు వెనుకల రచియించి పరిత్యాగలోభంబున మన్నా
మంబులు వ్రాయక మనంబునఁ దలంచుకొన నుంచుకొనియె నని తానె పొసగించి,
యవియే నాలుగువిధంబుల నిట్లనుచుఁ జదివె. ‖ 110 ‖

క. కృష్ణా నిను మది మఱవను, కృష్ణా నను నెనరు మఱచి కినియకు నాపైఁ
గృష్ణా కనికర ముంచర, కృష్ణా యని తలఁచినపుడె యెనసెద ననరా. ‖ 111 ‖

క. కృష్ణా కనికర ముంచర, కృష్ణా యని తలఁచినపుడె యెనసెద ననరా
కృష్ణా నిను మది మఱవను, కృష్ణా నను నెనరు మఱచి కినియకు నాపై. ‖ 112 ‖

క. నిను మది మఱవను కృష్ణా, నను నెనరు మఱచి కినియకు నాపైఁ గృష్ణా
కనికర ముంచర కృష్ణా, యని తలఁచినపుడె యెనసెద ననరా కృష్ణా. ‖ 113 ‖

క. కనికర ముంచర కృష్ణా, యని తలఁచినపుడె యెనసెద ననరా కృష్ణా
నిను మది మఱవను కృష్ణా, నను నెనరు మఱచి కినియకు నాపైఁ గృష్ణా. ‖ 114 ‖

క. అని రచనఁ బొగడి కృష్ణుఁడు, మనమున సంతోష మంది మక్కువఁ జిలుకన్
గనుఁగొని గ్రక్కునఁ జను మిఁక, ననువుగ నే ఁటెపె వత్తు నని తెల్పవలెన్. ‖ 115 ‖

గీ. మొదలఁ బదివేలనేరముల్ మోచియున్న, నేను నేఁ డింక నేమన్న నిక్కమగునె
రాధతోఁ దెల్పు మొకమాట “రమణి ఁటెపె, నీదు పదమాన వచ్చెద నిజ” మటంచు. ‖ 116 ‖

క. అని మారుకమ్మ యొసఁగిన, వినయంబునఁ గొని శుకంబు వినువీథి వడిన్
జనుదెంచెను వ్రేపల్లెకు, మునుపటి తనపక్షపాతమును గనుపింపన్. ‖ 117 ‖

గీ. వచ్చుచిలుకఁ జూచి వనిత దిగ్గున లేచి, బార చాచి తిగిచి గారవించి
పోయినట్టిపనులు కాయొ పండో యన్నఁ, బండుపండు ఁటెపు పండు గనిన. ‖ 118 ‖

క. ఇంతమొగ మంత చేసుక, యంతింతనరాని నిస్తులానందముతోఁ
గొంతవడి యూరకుండి త, నంతనె రాచిల్కఁ జూచి యంగన వల్కెన్. ‖ 119 ‖

ఉ. కంటివె కన్నులార నవకంతుని రూపము; వీనులారఁగా
వింటివె వానిమాట; లోడవెంబడినైనను నన్ దలంచునా;
యంటివె కృష్ణ కృష్ణ యని; హా శుకమా! పొడఁగంటి నీవు మా
వంటియదృష్టహీనులకు వాని గనుంగొనుభాగ్య మబ్బునే? ‖ 120 ‖

క. ఉన్నాఁడో గోపాలుఁడు?, విన్నాఁడా నీదుమాట? వేడుక వచ్చే
నన్నాఁడా నీతోడను?, మన్నాఁడా యేడనైన మక్కువతోడన్? ‖ 121 ‖

ఉ. ఏమనె నేమి పల్కె నిను నే మని పంపెను నన్ను దూఱెనో
రామనెనో పరాకిడెనొ రాజులయేలిక కృష్ణమూర్తి నా
స్వామి ముకుందుఁ డచ్యుతుఁడు వారిజనాభుఁడు శేషశాయి న
న్నేమనె; నేమి చెప్పుమనె; నేమని పంపెను ; నిన్ను నేమనెన్. ‖ 122 ‖

క. అదియుండె నేను వ్రాసిన, పదపద్యములెల్లఁ జదివి భావముఁ గనెనా
బదు లేమి పంపెఁ దెమ్మని, పొదలుచు నాలేఖఁ గొనుచుఁ బొలఁతుక నగుచున్. ‖ 123 ‖

క. పత్త్రికల వ్రాయుజాణకు, బత్త్రికలను వ్రాయు టేమిప్రౌఢి యటంచున్
బత్త్రికఁ జనుగవపై నిడి, పత్త్రార్థము సొమ్ముఁ దెమ్మ పత్త్రిక యనుచున్. ‖ 124 ‖

ఆ. చిలుకతోడఁ గొంతసేపు మాటాడుచు, మొదలుకొనినచోటె మొదలు గాఁగ
నాల్గుచరణములును నాలుగువిధముల్లై, తనరుపద్య మిట్టులనుచుఁ జదివె. ॥ 125 ॥

క. తలఁచినఁ గలసెద రాధా, తలపడు మరుశరములకును దలఁకకు రాధా
నెల నిఁకఁ దలఁపకు రాధా, కల చిలుకలపలుకులకును గలఁగకు రాధా. ॥ 126 ॥

వ. అని చదువుకొని తచ్చాతుర్యంబునకు మెచ్చుచు నీపాటికటాక్షంబున్నదే యశోదా
గర్భరత్నాకరరాకాసుధాకరున కని తన పెంపుడుచిలుకను బ్రియంబు దొలఁక
దువ్వుచు నీవల్ల నుల్లం బీపాటిచల్లదనంబున నుల్లసిల్లె. శుకకులరత్నాకరరాకా
సుధాకరా! ద్వారకాపురం బేకరణి నుండె నందలి వింత లేచందంబున నుండె నందు
గోవిందుం డేయందంబునఁ గొలువై యుండె నంతయుఁ దెలియఁ బలుకవలయు
ననిన రాధికావధూతిలకంబునకు ముద్దుచిలుక యిట్లనియె. ॥ 127 ॥

సీ. అష్టదిక్పరిచుంచితాభ్రంకషవిచిత్ర, గోపురం బలద్వారకాపురంబు
మహీపదాంభోజాతమణిమయమహనీయ, నూపురం బలద్వారకాపురంబు
సకలవైభవభోగసరణిపరాజిత, గోపురం బలద్వారకాపురంబు
కమలాంబకునిఁ గన్నకమలాలయకు నుండఁ, గాఁపురం బలద్వారకాపురంబు
గీ. నీలపద్మమహాపద్మనిరుపమాన, విజయకరశంఖవరకుందవినుతమకర
కచ్ఛపముకుందశోభితఘనలసదల, కాపురం బగు నలద్వారకాపురంబు. ॥ 128 ॥

చ. పురవరసౌధవాటముల బోటులపాటలఁ జంద్రకాంతముల్
గరఁగి ప్రవాహముల్ దివిముఖంబున రా వినువాఁక యంచుఁ ద
త్తరమున వేకువన్ సురవితానము, తాపము సేయఁ గ్రుంకుచో
"హరిరో హరీ" యటంచుఁ బరిహాసము సేయుదు రవ్విలాసినుల్. ॥ 129 ॥

చ. అలరెడివీటివజ్రమయహర్మ్యరుచు ల్దివిఁ గప్పఁ బల్కుతొ
య్యలిఁ గనుఁగొంటి నంచు నపు డానరవాహనపుత్త్రువేశ్యకున్
జెలఁగఁగ వేలుపుందపసి చేయు నమస్కృతి మాటిమాటి; క
క్కలికియు నేను గా నను, గాంతుఁడు విన్నను నేగి పొమ్మనున్. ॥ 130 ॥

చ. పుడమిజనంబు లీయినునిఁ బూర్వగిరిం దిగి పశ్చిమాద్రిపైఁ
బడునని యాడుకొందు రది పట్టరు ద్వారకలోనివార లె
క్కడిమత మంచు; దూరుపుటగడ్తను దోఁచుచుఁ గోట యెక్కి యా
పడమటగడ్త వ్రాలు నొకబాలునిగాఁ గనుఁగొందు రయ్యెడన్. ॥ 131 ॥

గీ. మేటినాకం బెఱుంగును గోటపొడ వ, గడ్తఁగలలోతు నాగలోకం బెఱుంగు
దీనిలోఁ దారతమ్యంబు దెలియరాదు, దానఁ బ్రథమ తృతీయ భేదములుతక్క. ॥ 132 ॥

సీ. ఆచారవంతులౌ నచటిభూదేవతల్, వావిదప్పిన బ్రహ్మవార్త నగుదు
రపజయం బెఱుఁగని యచటిరాచకొమాళ్లు, రణమున వెనుకయౌ రాము నగుదు
రందఱిఁ బోషించు నచటికోమటు లాది, భిక్షుకు రోయు కుబేరు నగుదు
రధికధాన్యసమృద్ధి నచటిశూద్రులు తన, హలము వ్యర్థమటంచు బలుని నగుదు
గీ. రచటితేరులు మేరువునైన నవ్వు, నచదటిగజములు శక్రునిగజము నవ్వు
నచటి హయములు పవమానునైన నవ్వు, నచటిభటకోటి నిప్పులనైన నవ్వు. ॥ 133 ॥

చ. ఘలుఘలుఘల్లుఘల్లుఘలుఘ ల్లనుఘంటల నొప్పు కాలిపొన్
గొలుసులు మందపున్నడలకుల్కులు హుంకరణంబు లొరచూ
పులవిడఁబాటు లారజపుఁబూనిక లానికలున్ మదోద్ధతుల్
దలఁపఁ గంధసింధురములా యనఁ బొల్తురు వారకామినుల్. ॥ 134 ॥

క. వడి గలిగి మృదుపదంబుల, నడవడిచే మిగిలి యౌ ననన్ సాదుల కె
క్కు డునగఁ జొప్పడుఁ దగునడ, గడు నలవడఁ దురగవితతి గరిత లనంగన్. ‖ 135 ‖

ఉ. అంగన నీపు పువ్వులుఁ గలాసెవె; యౌ మగవారు లేరు ; లే
కం గడిదేరినావె వళు లౌ; వెలకుం గొనుమోవితేనె; బం
తిం గనకుండ దాఁచి; తది తెరకుఁ జూపుదురా విటుండ; కొ
న్నంగడి మారుబేరములె; యంచు వచింతురు పుష్పలావికల్. ‖ 136 ‖

గీ. అట్టిపట్టనమెల్ల నేకాధిపత్య, ముగ భరింపుచున్నాఁడు నీమగఁడు నేఁడు
ఱెపె పట్టపుదేవి గానోపు దీవు, మమ్ము నేరీతిఁ బ్రోతువో మఱపు లేక. ‖ 137 ‖

ఉ. నీడలువారుమేడల ననేకము చూచితి నాఁడు మేడ లా
మేడలలోన నొక్కమగమేడ భవత్పతికొల్వుమేడ యా
మేడకుఁ దూర్పుప్రక్క నొకమేడ చెలంగఁగ శౌరితోడ నీ
మేడకు నెవ్వ రాధ్యు లన మీపువుఁబో డని పల్కె నవ్వుచున్. ‖ 138 ‖

గీ. మగువ మగరాలచవికె నీమగఁడు నేను, నీప్రసంగము లాడ నానీడ పార
నచట నొకచిల్క ననుఁ జూచినట్టులుండె, నవల నెవరన నెవరు లే రనియె శౌరి. ‖ 139 ‖

చ. ఇటు ననుఁ బంపినన్ మొదట నే నటు వోయిన త్రోవఁ దప్పి చీఁ
కటి నడిమిద్దెయిండఁబడి కాంతమణుల్ బయలంచు భ్రాంతిచే
నట నెగఁబ్రాకి తాకి తడవాడుచు గూడులవెంట దూరి యె
ప్పటిహరిముంగలం బడి కృపన్ గడవెళ్లితి ద్రోవ చూపఁగన్. ‖ 140 ‖

మ. ఒకకీల్గోపురమందు వింతే గనుఁగో నూహించి యాపైన నిం
చుక కాలూనిన గిఱ్ఱునం దిరుగ నచ్చోఁ బోవరాదంచు బు
ద్ధికిఁ దోఁచెన్ మఱియొక్కవింత విను మాతీరంబునం దొక్కబొ
మ్మ కరం బెత్తనిజాలకున్ బడఁతిగా మల్లాడుచు న్నవ్వితిన్. ‖ 141 ‖

ఉ. గోలతనంపుజిల్క యని కోమలి నవ్వకు; నీవు ముందుగా
బేలవు గాక తప్ప దొకపెద్దహజారముఁగన్న వీఁడు గో
పాలుఁడు వీఁడు కృష్ణుఁ డనుభ్రాంతిని జిత్తరుబొమ్మలెల్ల నా
పోలిక నున్నఁ బైబడక పోదువె; తాళుము; రేపె చూచెదన్. ‖ 142 ‖

క. సైచు మని పలుక రాధిక, యోచిలుకా యింత యేల యుడికించెదవే
నీచిత్తము నాభాగ్యం, బాచతురుం డెపుడు వచ్చు నని యడుగునెడన్. ‖ 143 ‖

గీ. కొంద ఱాభీరపూర్ణరాకేందుముఖులు, నగుచు నేమక్క విన్ననైనావు నీవు
మాట లేమన మఱి యేటిమాట లనుచు, నొకటిపైఁ బెట్టు నిదెమాట కొకటియుండ. ‖ 144 ‖

వ. అనిన నవ్వాలివృత్తాంతంబు చెప్పుమనుటయు. ‖ 145 ‖

ఉ. సింధుగభీర! శీతకరశేఖరజూటనటద్వియన్నదీ
బంధురశీకరప్రకరపావనసత్కవితాధురంధరా!
సింధురగామినీనఖరచిహ్నవిభూషణభూషితోజ్వల
త్కంధర! నీతినూతనయుగంధర! బర్హిణబంధుకంధరా! ‖ 146 ‖

క. ఖరనఖరశిఖరముఖరిత, వరరవవీణాప్రవీణ! వాణీరమణీ
శ్వరనారదహరపారద, శరకీర్తివిహార! కృష్ణసచివకుమారా! ‖ 147 ‖

మాలిని. సులభనవమనోజా! సూర్యసంకాశతేజా!

ఫలితహరిసుపూజా! బంధుమందారభూజా!
కలితసుకవిభోజా! కాంతసత్కాంతిరాజా!
లలితగుణసమాజా! లక్ష్మమాంబాతనూజా! ‖ 148 ‖

గద్య. ఇది శ్రీ మద్వేణుగోపాలవరప్రసాదలబ్ధ శృంగార కవిత్వవైభవ
వెలిదిండ్ల తిరువేంగళార్యతనూభవ విద్వజ్జనవిధేయ వేంకట
పతినామధేయ ప్రణీతం బైన రాధామాధవ
సంవాదం బను మహాప్రబంధంబునందుఁ
ద్వితీయాశ్వాసము.

శ్రీరస్తు

రాధామాధవసంవాదము

తృతీయాశ్వాసము

క. శ్రీకరవరవైభవని, త్యా! కమలనాథమృదుపదాంబుజభృత్యా!
యాకారవిజితనాస, త్యా! కృష్ణాపత్య! రామదాసామాత్యా! ॥ 1 ॥

గీ. అవధరింపుము జనకధరాధిపతికి, మతిని సంతోష మొదవ సన్మౌనితిలకుఁ
డైనశుకయోగి రోమాంచితాంగుఁ డగుచు, నవలికథయెల్ల నిట్లని యానతిచ్చె. ॥ 2 ॥

ఉ. అప్పుడు కృష్ణదేవుఁడు దయాంబుధి గావునఁ గావు మన్నచో
గుప్పున నాగజేంద్రుకడకుం జనుదెంచినరీతి వచ్చెఁ దా
నెప్పటిగొల్లపల్లెకుఁ గవీంద్రులు గాయకులున్ సఖుల్ భటుల్
తప్పక వెంట రా రథము దారుకుఁ డింగిత మెంచి తోలఁగన్. ॥ 3 ॥

గీ. మునుపు తానున్నరీతులు మొదటికథలు, నక్కడక్కడ సఖులతో నాడుకొనుచుఁ
గనుచు నట గొల్ల లెవ్వరో యనుచు బ్రమయ, నడచి కృష్ణుండు నందునినగరు చేరె. ॥ 4 ॥

క. బడలితిరి మీర; లిప్పుడు విడిదిండ్లకుఁ బొండు; మిమ్ము వెనుకఁ బిలిచెదన్;
దడసితిరి భోజనానికిఁ దడయక సేదలను దేరఁదగు మీరు వడిన్. ॥ 5 ॥

చ. అని పలుకుల్ వినంబడినయంతఁ బడంతులఁ జేవదల్చుచుం
గనుబొమ నిక్క నంబరముఁ గన్గొనుచుం జెవి వ్రాల్చి కొంతసే
పున కిది శౌరిపల్కుబడి పో వినగల్గెనె యంచుఁ దత్తరం
బును దమకంబుఁ దాల్మి భమము న్మదము న్మదిలో బెనంగఁగన్. ॥ 6 ॥

క. బిరబిరను సెజ్జమీఁదికి, నరిగి గవాక్షములఁ జూచి హరియే యనుచుం
బరికింప రాధికామణి, మఱియేమియుఁ దోప కపుడు మ్రాన్పడియుండెన్. ॥ 7 ॥

వ. అంత. ॥ 8 ॥

సీ. వచ్చెనా నాతండ్రి వాసుదేవుం డని, నందుండు వచ్చె నానందముననుఁ
నాచిన్నపాపని జూచితినా యని, సొంపున జేరె యశోద ప్రేమ
మననేస్తకాఁడు చేరెనటంచు గోపాలు, గుమిగూడి మూగిరి గొల్లలెల్ల
నేడైన దయకల్గెనే యంచు గోపిక, ల్పొరుగిండ్లనుండి చూచిరి కడంగి
గీ. చెలగి కృష్ణుండు దుప్పటి మొలబిగించి, తల్లిదండ్రులపాదపద్మముల కెరగె
వారు దీవించి కౌఁగిట గారవించి, రపుడు వారలభాగ్య మేమని నుతింప. ॥ 9 ॥

ఉ. నందకుమారు డంత జిఱునవ్వు మొగంబున దేటకన్నులన్
బొందుగ జాఱుపూలసిగ పొంకమునన్ దల పగ్గలించు మై

గంధపుబూతచే నలుపు గన్పడ కొక్కవిలాసమూర్తి విం
తందము మించినట్లు కననయ్యె నెగాదిగ జూచువారికిన్. || 10 ||

మ. అచటం జల్లగ దల్లిదండ్రులమనం బానందముం జెంద బ
ల్కుచు గోపాలుర బుజ్జగించి నలుదిక్కుల్ జూచి తన్ జేరగో
రుచునున్నట్టిప్రజాంగనామణులకోర్కుల్ జూపులన్ బ్రీతి జొ
న్పుచు వార్వారల నిండ్ల కంపి చనె గృష్ణుం డానగర్లోనికిన్. || 11 ||

గీ. చని యనుంగులతోడ భోజనము చేసి, తల్లిదండ్రులతో గొంతతడవు దానుఁ
బెండ్లియాడినముచ్చటల్ ప్రేమ నుడివి, వారియనుమతి నిద్రింపవలయు ననుచు. || 12 ||

ఉ. ఇంపు ఘటిల్ల నొక్కపడుకిల్లు గనుంగొని యందు రాధయం
దంపుటెలుంగు వీనుల వినంబడ దా విననట్లు చేరి నున్
గెంపులచెక్కడంపుబని గీల్కొనుబంగరుపావ లెక్కి ని
ద్దంపుమెఱుంగుజాయజముదాళికరంబున దల్పు మీటినన్. || 13 ||

గీ. అమ్మ నేజెల్ల యది యెవ్వ రనగ రాధ, యెటకు బోవడు మిం దెవ్వ డేల వచ్చు
నేను నీయల్లుడనటంచు నెనరుదోప, బాదములమీద వ్రాలె గోపాలమూర్తి. || 14 ||

క. లేవయ్యా దొడ్డవాడవు, నీ వని తా నవలి కేగి ని న్నేమనుచుం
దీవింప; నిందు మునుపే, గోవిందుడు నిత్తెపెండ్లికొడు కన విందున్. || 15 ||

గీ. పాన్పుమీదను గూర్చుండి పలుకవయ్యా, మీరలును మహారాజు లైనారుగనుక
నే నమస్కృతి సేసెద నిదిగొ యనుచు, మ్రొక్కి తా బాన్పుదిగువ నింపున వసించి. || 16 ||

క. వెఱగుపడి యూరకుండెడు, హరిగూరిచి రాధ పలికె నానాటివలెన్
మురిపము గలదో లేదో, యరయుదమని వచ్చినావె? యరయుము రాధన్. || 17 ||

ఉ. ఊరక యేమియు బలుకకుండెద నంచు దిటానను న్నశృం
గారగుణావతంస! నిను గన్గొని మిన్నక యూరకుండ దీ
నో రొకపెండ్లికైనను ననుం బిలిపించితె? చూడ నెవ్వరున్
లేరని కాదు; నీదయకు నే దగుదానను గాన వేడితిన్. || 18 ||

క. గోపాలక మాటాడక, గోపంబున నుండ నెంచుకొంటిని మొదలన్
నాప్రజ్ఞ నడవబోదని, కోపము నేనే శమించుకొంటిం బిదపన్. || 19 ||

ఉ. వేడుకకత్తెనంచు రతివింతల నిన్ బ్రమియింపజూతునో
మోడి వహింతునో భువనమోహిని నేనని కాక యేల పెం
డ్లాడితి వంచు బాధ్యతను నాడుదునో యిదియేమి యెందునుం
గూడనిదాననై చనవు గోరెద నెవ్వతె నంచు దూఱెదన్. || 20 ||

ఉ. మానుష మెంచియైన నొకమంచితనానకునైన నీవు పు
ణ్యానకు మాటలాడెదవు; నాతరమా నిను బల్మి జేసి నే
సానకుఁ బిల్వ; నీఘనత చాలదె రాధకుఁ; గాక కాఁకచే
నే నొకటాడ నేటి; కది నీకు నసభ్యతఁ దోప నేటికిన్. || 21 ||

ఉ. దోసము కృష్ణ కృష్ణ నిను దూఱిన; నానొసలందు ధాత మున్
వ్రాసినవ్రాఁత కాదనుచు వ్రాయఁగ నీవశమౌనె; నీవు నే
వేసట లేక యేరికని వేడుకచేసెదు పైని పైని నా
సాసల మాకు మేమె పయినాడుచు నిన్నన నేర మున్నదే. || 22 ||

చ. ఎడనెడఁ జూడుమంటివొ; పయింబయి నెమ్మది నిల్పుమంటివో;
గడెగడెఁ గోరుమంటివొ, వగంబడుమంటివొ, వేఁగుమంటివో,
బడలుమటంటివో; యరుచి పాల్పడమఁటివొ; సిగ్గు నెగ్గు లే
కడలుమటంటివో, పొరలుమంటివొ; మూర్ఛ మునుంగుమంటివో. || 23 ||

ఉ. ఒక్కతె భ్రాంతిచేఁ బొరల నొక్కఁడు మాన్పగఁ బూఁటకాఁపె? నే
నెక్కడిదాన నీవు మును పెక్కడివాఁడవు నాకు నీకు నే
మక్కరయున్న దైన నొక రాడెడిపల్కులు నేనె బల్కెదన్
గ్రుక్కక; యాయెఁ బోయె నవి కొన్నిదినాల ఋణానుబంధముల్. || 24 ||

మ. మన మాన్ఁడు మహావినోదములఁ బ్రేమ ల్మీఱ భోగించుట
ల్విను మీనాఁటికి నిద్ద ఱొక్కరొకరిన్ వేసారుటల్ వింతలై
కనుపించన్ రచియింపనేరిచి కవు ల్కల్పింప లోకానకున్
వినవౌ; నింతియచాలు; మీఁదికథ లీవీనుల్ వినన్ లే వికన్. || 25 ||

ఉ. అందుకు బైసిమాలి యొకయత్నము చేసుకయుంటినేని నా
యందుఁ బదాఱువేల కొకయంశము రాదు భవత్కటాక్ష; మీ
సందున భోజకన్యకయు సత్యయుఁ దృప్తి వహించినంగదా
యిందఱమీఁద రాధ యిఁక నేటికిఁ జాలదె జీవనానికిన్. || 26 ||

మ. తుది నెట్లయ్యెదనో యిదేటికి విరక్తల్ రేపు నీరుక్మిణీ
సుదతీరత్నము నీవు వాదుఁకొనఁ బొంచుల్ చేరి నే నల్కఁదీ
ర్చెదనో యెవ్వ రెఱుంగువారు మఱి నీచిన్నారిపూఁబోండ్ల నే
ర్పెదవంగా గయిసేసి పెద్దతనమై యుండంగ నేఁ గందునో. || 27 ||

మ. సతమా పొత్తులవన్నెకాఁడని గణించన్ లేక యీగొల్లగు
బ్బెతలన్ బోరితి నేఁటిదాఁక; నది చూపెన్ జూడు చేసేత; నా
గతి నీపట్టపురాండ్ర యొకతె పల్కన్ కారణం బున్నదే?
యతిమాత్రం; బెన రేమి సేయ నిఁక మధ్యస్థుండవై తన్నిటన్. || 28 ||

సీ. పాలువెన్నలకుఁ బైబడెడునాఁటికెకదా, యాదరించు యశోదమీదిప్రేమ
వేడుకతోడ ముద్దాడునాఁటి కెకదా, మిక్కిలి నందునిమీఁదిప్రేమ
వ్రేపల్లె దూడల మేపునాఁటికెకదా, మేలమౌ గొల్లలమీఁదిప్రేమ
అబ్బినయెడల మల్లాడునాఁటికెకదా, మిక్కిలి మాబోంట్లమీఁదిప్రేమ
గీ. తండ్రి వసుదేవుఁ డయ్యెను దల్లి యిపుడు, దేవకీదేవి యయ్యెను దేవరకును
సఖులు నృపులైరి రాబోంట్లు సకియలైరి, చాలదే నేఁడు కొత్తసంసారమయ్యె. || 29 ||

మ. విమలాత్మా! యొకవిన్నపంబు వినుమా వ్రేపల్లెలో నున్నపా
పమునన్ మానితొ నన్ను; నేను మెలఁగేపాపాన వ్రేపల్లెపై
మమతల్ మానితొ, యింతమాత్రము వచింపన్ లేవె; పుణ్యంబు నీ
కమరున్ గారణకార్యముల్ దెలిసి యోగ్యాయోగ్యము ల్చూచెదన్. || 30 ||

ఉ. యేమిటికంటివేని విను మిక్కడివారలు నాఁటినుండి నీ
వేమొ త్యజించి నాకొఱకె యీడకు రావని యాడుగొందు రా
సామి యెఱుంగు నీమనసు జన్మముదాల్చుటయాదిగాఁగ నా
నాముఖబాధలం బడితి నల్గురికిం బగయైతి నీవగన్. || 31 ||

చ. నిలువనిప్రేమదోసమున నెంజిలి నీకు వచింప; నేరికిన్
దెలుపుదు నిందుకోసమె యతిత్వర రమ్మని కమ్మఁ బంపుటల్
పొలుపుగ నేఁటితో మనసులోఁ గల త్రొక్కుడులెల్లఁ దీఱె ని

ర్మల మీఁకమీఁద నేమయిన మంచిది యం చిది సమ్మతించితిన్. ‖ 32 ‖

మ. ఇల నీమోహపుటాండ్రు నీవు పదివేలేండ్లున్ మహారాజులై
కలిమి న్బల్మిని జల్లనై బ్రతుకు డింక న్నన్ను నాపేరునుం
దలంపబోకు; తలంప నేమి పని? యాదైవంబు నీతోడనే
కలసెన్; బాసలు నీకు మేలొసఁగు బో కంజాతపత్రేక్షణా. ‖ 33 ‖

శా. దైవం బెంతకు దెచ్చె? నీవలపు లేదా నాఁటికి? న్నేటికిన్
ద్రోవల్ పుట్టెనె? నాఁటి దీగుణమె కాదో; నాఁటి విమ్మేనులే
కావో? లేక యిదేమి; యీ నడత; లీకైలాట; లీమోసముల్;
నీ వాకృష్ణుఁడ వేను రాధనెకదా నీరేజపత్రేక్షణా! ‖ 34 ‖

ఉ. ఇన్నిదినంబు లే బ్రతుకనెంచుట యేమిటి కంటివేని యీ
కన్ను లదేమొ నిన్నుఁ దమకాంక్షలు దీఱఁగఁ జూడఁగోరె; నే
నున్నది దేవుడుం తెలియకుండునె; దేవుఁడటందు నీకు లే
కున్నను మాఁకు బామరిక మున్నది యున్నదినాలలోపలన్. ‖ 35 ‖

ఉ. వంచన మాని గుట్టు మగవానికి నాఁడుది మించి యియ్యరా
దంచు వచింతు; రౌనది యథార్థము; ముంగల నిన్ను నొక్క టా
సించినదానఁ గాన నది చెప్పకతీఱదు; నేను బడ్డపా
ట్లెంచఁగ రాధ దయ్యముసుమీ యిది యేమని చిత్తగించెదో. ‖ 36 ‖

సీ. ఒంటిగాఁ బవళింప నూరక నాగుండె, యదరంగ నెగవైచినట్లు తోఁచు
వడి లేచి తెగువతో నడవ నూహించుచో, నదుముచుఁ బైఁబడినట్లు తోఁచు
కాదని యటులేప గమకింప వడఁకుచు, నదియేమొ కుదయించినట్లు తోఁచు
గోరంతయుబుసుగాఁ గూర్చుండఁదలఁచుచో, నట్టె సివంబాడినట్లు తోఁచు
గీ. వెఱ్ఱి పట్టినఁ గొంతవివేక ముండు, జలధిలో బడ్డ నొకతెప్ప గలిగియుండు
నింతగా దిక్కు దెసలేని యిట్టివెతలు, నాతలనె పెట్టవలెనె యాధాతకైన. ‖ 37 ‖

మ. అడిగేవారొ; మనంబు చల్లఁగను మాటాడేటివారో; ప్రియం
పడ నూరార్చెడివారొ; మిక్కిలిదయన్ భాసించుచున్ బుద్ధిఁ దె
ల్పెడివారో; ధృతిలేక యేడ్చుచు మొఱల్ వెట్టంగఁ గన్నీళ్ళు చేఁ
దుడిచేవారొ; యొకింత రేఁబగలు నాతో వేఁగువారో కడున్. ‖ 38 ‖

చ. నలువురు నవ్వఁగా నడవినక్క శివంబయి పొర్లి యంతలో
మెలఁకువ నన్ను నే నుపశమించుక క్రుళ్ళుచు లోన మించినన్
దెలివిని దెచ్చుకొంచు నొకదిట్టతనాన దినాలు త్రోసి యిం
తలరితి నిన్నుఁ జూచితి దురాసలు రోసితి మేలు చేసితిన్. ‖ 39 ‖

ఉ. ఓర్పున భాగ్య మెతేయని యూరక నీపలు కెంతుఁగాక యా
నేర్పు లిఁ కేమి యల్లుడవు నీవని నేనపు డెత్తి పెంచి యీ
డేర్పను, నేఁడు తాము రమియించి మదించను, తమ్ముజూచి ని
ట్టూర్పులతో నిటుల్ కరఁగియుండఁగ నేవది యేల యిం కిటన్. ‖ 40 ‖

శా. నామీఁద దయ యుంచుమయ్య యనుచున్ మౌనంబుతో
రాధికా భామారత్నము చెక్కు కేలనిడి గోపాలుం గనుంగొంచు వీ
ణామాధుర్యకలస్వనంబు దొలుకం దా నేడ్చెఁ గన్నీటనున్
గోముంజన్నులు గొప్పఁదోఁగి కడకన్ లో నెక్కుచున్ స్రుక్కుచున్. ‖ 41 ‖

క. కాంతాళంబున రాధా, కాంతామణి రోదనంబు గావింప రమా

కాంతుఁడు గుణవంతుఁడు నర, కాంతకుఁ డపు డలుకఁ దీర్తునని వడి లేవన్. ‖ 42 ‖

క. ముకుచెవు లదరఁగ గోపము, ముఖమున కొకవింత దోప మ్రొక్కుచు రాధా
ముకురాస్య రాకు రాకని, మకరాంకునితండ్రి కనియె మఱిమఱి కినుకన్. ‖ 43 ‖

క. ఎనిమిదిరసములఁ గాంతల, నెనమండ్రను బెండ్లియాడి యిఁక నొకకొదువై
పెనుపొందుహాస్యరసమున, నను మచ్చిక సేయ వచ్చినాఁడవె కృష్ణా. ‖ 44 ‖

క. నాతోడిది నీ కేటికి; నాతో డిఁక బలుక రాకు; నాతోడిసఖుల్
నీతికి జాతికి వెలిగా, జూతురు నీతోడి చెలిమిఁ జేసిన నన్నున్. ‖ 45 ‖

క. కడనుండి యాడవలసిన, యడియాసలమాటలెల్ల నాడుము నాపై
నిడవలసిన నేరం బిడు, గడిదేరితి నాఁటిరాధ గాదిఁక మెలఁగన్. ‖ 46 ‖

వ. అని సవతులపయిం బొడము పెరుసునం బెరుఁగుకినుకచేత నొకటిసేయం జేతఁ
గాని వితంబున లేనికలంకలు మనంబునం దొలఁక తొందరపడి యెందునుం
ద్రోవగానని కొందలపాటున వెనుకముందఱతోఁచక యన్నియుం జేసి తటస్థుని
విధంబున నున్న సన్నిధానప్రియభావి వియోగానలకందర్పహేతిఘాతంబుల
నిలువునం గృశించి కలితకంకణనయన యగుచు నప్పటప్పటికిఁ దలఁ ద్రిప్పుచుఁ
దప్పక తనుఁజూచు నప్పడంతిఁ గటాక్షించి యించుక విచారించి యిది యేమనియుం
వలంపక తెగించియున్నది యెందు నపనమ్మికలం బడువారిమనంబు లొడంబడికలం
గాని తీర వని వినయాదరసంభాషణంబుల షోడశసహస్రరాజకన్యకామనోహరుం
డిట్లనియె. ‖ 47 ‖

చ. పడతిరొ చూఁడు నీకుఁ గలపాటివిచారము మాకు లేదె; నీ
యడుగుల వ్రాలి కొంతప్రియమైనఁ దుద న్వివరింతు నన్నచో
దొడిబడ నానఁ బెట్టితివి ద్రోహము చేసినవాఁడ గాను నా
చిడిముడియెల్ల విన్నపము చేసెదఁ దాలిమి నూఁకొనన్వలెన్. ‖ 48 ‖

మ. మును బాల్యంబున నీవు ప్రోవనితఱిన్ మోదంబుతో నున్నచో
నను నానావిధగండముల్ బొదువుచున్నన్ నీకటాక్షంబుచే
తనె కాదా కడవెళ్లఁగల్గె నది రాధా నాఁడు బాలెంతయుం
చును బండ్లంచును గాలియంచుఁ దరులంచున్ మాయలం చందుమే. ‖ 49 ‖

క. వెనుకన్ దెలిసెను కంసుని, పనుపని యది తెలియలేక బలిమిని బిలువన్
జనవలసె మధుర కవ్వల, వినకుందువె మామ యచట విడివడినకథల్. ‖ 50 ‖

గీ. తల్లిదండ్రు లయ్యుం దారు గాకుండిరి, చెరలఁ దగిలి వెడలఁ దెరువులేక
ననుఁదలంచు దేవకిని వసుదేవుని, నరయవలదె దోషమా లతాంగి. ‖ 51 ‖

ఉ కట్టిడిసేఁతలు న్వెతలు, గంసునితోడనె దీఱెనంచు నే
గుట్టు వహించి రాజ్యమునకున్ బరు వానక వానితండ్రికిం
బట్టముఁ గట్టి యాకుదురుపాటవునంతకు నిల్చి యంత ను
న్నట్టుల నిన్నుఁ జూడవలెనంచుఁ దలంచుక పైన మౌనెడన్. ‖ 52 ‖

మ. సకియా! కంసునిఁ జంపినామని జరాసంధుండు గోపాన నూ
రక మామీదఁ జలంబుతో దిగి యహోరాత్రంబులున్ గోటఁ జు
ట్టుక పోరాడు బలంబుతో మరలి పోటుంబంట్లతో డుల్లు నా
బకశాటావకుఁగాదె యానడుమ నేఁ బార్వారి డాఁగుండితిన్. ‖ 53 ‖

క. ఈడకువచ్చినఁ గాదని, యాడకునుంబోక మనము హాయిగ నెచటన్

కూడానుండుదుమో యని, వేడుకను సముద్రు నడిగి విను నేర్పుమెయిన్. || 54 ||

గీ. వనధినడుమను ద్వారక యనగ నొక్క, పురముఁ గల్పించి యందు గాపురము గాఁగ
నచటివారల రప్పించి యిచటి కేను, బైనమైయుంటి నింతలోపలనె వినుము. || 55 ||

శా. వాండ్లు నీ్వండ్లు మమున్ బడంతి యనుచున్ వాక్రువ్వఁగా వించు దా
విండ్లమ్ముల్ శిశుపాలుఁ డందుకొని రీవిం బైకొనం దోడ వి
ల్కాండ్ల న్వాని జయించి రుక్మిణి నటుల్ వంశాభిమానంబుకై
పెండ్లాడన్వలసెం బయోజముఖి దప్పెనిన్ శమింపందగున్. || 56 ||

చ. ఇవతల నొక్కరాజు తనయింటను రత్నము పోయెనంచు నా
యవుదల నింద మోపఁ బరిహారముగా నొకజాడవెంబడిన్
దవుల వనాంతరంబునను న న్నని మెచ్చి పురాణబుక్షపుం
గవుఁ డగురామదాసు, తనకన్యను రత్నము నిచ్చె బల్మిచేన్. || 57 ||

క. అపు డారత్నముఁ దొలుతటి, నృపునకు నిచ్చినఁ గుమారి నిచ్చె నతండున్
జపలాక్షి నిందసోకిన, యపకీర్తికి వారిఁ బెండ్లియాడఁగవలసెన్. || 58 ||

గీ. గడమవారల నొక్కొక్కకారణాన, నటు బ్రతిష్ఠకుఁ గాఁ బెండ్లియాడవలసె
నొకటి సేయంగఁబోయిన నొకటి వచ్చు, నెదుటివారు వివేకులై యెఱుఁగవలయు. || 59 ||

మ. చెరలోనం బడువారు లేరా? దయచేసేవారలు న్లేరో? కా
తరలంచు న్విడిపించఁబోయిన నదే తప్పే? పదార్వేలురా
తెరవవ ల్నామెడఁ జుట్టుకోవలెనె యాదీనత్వముం జూడ కే
మరుమాటాడఁ దెగింతు; రేమని వచింపన్ లేక పెండ్లాడితిన్. || 60 ||

క. ఈలాగు నొక్కొక్కతెఁ, జీలలువలె దగులుకొనఁగఁ జేసెను దైవం
బేలా యొడలెఱుఁగనిశశ, మేలోకమునందుఁ గలదె యిది నిజమౌనే. || 61 ||

మ. ఇదిగో చేసినపాప మీపలుకులం దేమాత్రముం దప్పినం
బదివే లేల భవత్పదంబులు దలంపన్ యోగ్యుఁడం గాను సం
పదతోడన్ బలగంబుతో బ్రతిభతో భాగ్యంబుతో నున్న వీ
మది కింపౌనని నీప్రతిష్ఠయని కొమ్మా నమ్మితి న్నెమ్మదిన్. || 62 ||

ఉ. ఏనటు గాక వారలపయిన్ దయగల్గినవాఁడ నైన నో
మానిని! నిన్ను నింత బతిమాలుదునే సమయంబుఁ జూచి యే
మేనియుఁ బల్కఁ గాని దయ నింతటిమోహము నీకు గల్గినన్
మానక నాదు వెంబడిని మచ్చిక రమ్మిఁక యుక్తు లేటికిన్. || 63 ||

ఉ. అన్నియు విందు నాకుఁగలయట్ల పదాఱువపాలు మేలు నీ
కున్నదె! నీకుఁదాఁ దెలియదో? యవివేకపుఁజేఁత నోరు లే
కున్నది గాని నిన్బలుక నోడెద? లోకమువా రెఱుంగరే
కన్నుల కల్కి నీవు దయగల్గుట నే దయ గల్గియుండుటల్. || 64 ||

క. అది యేల యాఁడుదానికిఁ, గొదవ లిడన్ రాదు గానఁ గొదువగు నేనే
యుదయుఁడ మహాపరాధిని; మదవతి యిఁకనైన మోడి మానఁగరాదే. || 65 ||

మ. అని పల్క న్వినలేక రాధిక సరోజాక్షు న్నిరీక్షించి క్ర
మ్మినసిట్టూర్పు లడంచి గద్దదిక నేమే నాడఁగాఁబోయి యే
లని తానే తలయూఁచి యోయి, విను కృష్ణా! జాణవం చందు రే
మును గల్పించుచు నేఁ డెఱింగితిమి సొంపుల్ గుల్కు నీపల్కులున్. || 66 ||

క. వేవిధముల నీమోహపు, దేవులకథ కథలు గాఁగ దెలిపెద వౌఁగా
నే వినవలె నను ప్రజ్ఞకొ, నీవేడుకొ కాక యేమి నేరుపు చెపుమా. ॥ 67 ॥

క. ని న్నెవ్వ రడిగి రీకథ, లిన్నియు; ని న్నెవరు కొదువ లిటు లాడిరి, మా
కున్నవి దయ లని యెవ రను, కున్నా; రీటక్కు లేల; నోయి మహాత్మా! ॥ 68 ॥

చ. వెడవిలుకానిచేఁ దనువు వేసరియున్నది; యందుమీఁద నీ
యుడుకులమాట లేమిటికి నూరక యాడెదు నేర్తు నంచు; మున్
బిడుగునఁ బడ్డవారి కొరవిఁగొని చూడుదురే వితావితల్
విడు విడు చాలు నెంతయవివేకము నేఁ డిటులయ్యె వేడుకల్. ॥ 69 ॥

గీ. మమ్ము హాస్యంబులాడక మానవేని, నాడవలసినయటులెల్ల యాడు మీవు
నేను విని తాళలేనని మౌనమునను, జెవుల నంగుళులను జొన్పి శిరము వంప. ॥ 70 ॥

చ. ఇది కదియంగ వేళ యని కృష్ణుడు పానుపు డిగ్గి రాధికా
మదవతిచెంతఁ జేరి నునుమై పులకించి చెమర్చ నొక్కకే
లుదుటునఁ దీసి కన్నుఁగవ నొత్తుక యోనలి కోమమున్న మం
చిది చల మేల నొక్కచెవిచే విను నా దొకవిన్నపం బనన్. ॥ 71 ॥

క. ఒకచెవి మూసుక విన్నప, మొకచెవి విను మనినమాట కుల్లములోనన్
ముకురాస్య వాదులాడక, మొక మోరఁగఁ జేసి కొంత మోడి వహించెన్. ॥ 72 ॥

ఉ. ఇప్పటి కింతె చాలునని యేమియునున్ బెనఁగాడఁబోక యా
కప్పురగందితో ననియెఁ గంజదళాక్షుఁడు కోపగించి యో
యొప్పులకుప్ప నీ విటులు నుందువె యుండిన నుండు మోమటుల్
ద్రిప్పఁగ నేమి చేసితిని దిన్నఁగఁ గన్నులు విచ్చి చూడవే. ॥ 73 ॥

క. నీమనసు రాకయుండిన, మో మైనం జూపరాదె మోసంబటవే
మామిళ్ల కాజ్ఞలైతే, కామిని గ్రుక్కిళ్ల కాజ్ఞ గలదే యెందున్. ॥ 74 ॥

ఉ. కోమలి లోకమందు నొకకొన్నిదినాలకుఁ గాదె కామినుల్
కాముకులందు నిల్పుదురు కాంక్షలు పిన్నటనాఁటనుండియున్
గోమున నెత్తిపెంచితివి గోరిక లుంచితి నాదరించితే
మేము యెఱుంగఁ జేసి తిపు డెవ్వఁడ నింత నిరాకరింపఁగన్. ॥ 75 ॥

చ. ఎఱుఁగనివాని నన్నుఁ జెలి మేటికిఁ జేసితి వాసఁగొల్పి నీ
సరసము నీవిలాసమును చాల మనంబున నాఁటె ని న్నిఁకన్
మఱవఁగజాల నేల బతిమాలఁగఁజేసెద వేమిపోయె ని
న్నరగడెసేపు కూడిన గృతార్థుఁడ నౌదుఁగదే తలోదరీ. ॥ 76 ॥

మ. కలలోనైనను నీవే దైవమని నేఁ గన్గొందు నాడెందముం
దెలియన్నేర్తవు దైవయత్నమున నెంతేనేరముల్ చేసినన్
జులుకం జూతురె; బుద్ధిగా నడుపుమంచుం దిద్దుకోరాదఁటే;
చెలి! నీచిత్తము నాదుభాగ్య మిఁక నాజీవంబు రక్షింపవే. ॥ 77 ॥

చ. కనికర ముంచవో, నెనరుగల్గినదానవు కావొ; భేద మీ
తనువులతోడ రాదనినదానవు గావొ; పడంతి యింతలో
మనలను జూడలేక నడుమంత్రపువారు గుబారు చేసి గొ
బ్బున నినువంటిదాని కెగఁబోసిరి నాతలపొప్పకుండగన్. ॥ 78 ॥

చ. చిలుకలకొల్కి నీసొబగుచిన్నెల నీనునుదేటపల్కులన్

వెలసె మనంబు కొంత, రతివేడుకలన్ జవిచూపితేనియున్
బలుకుల కేమి నాతనువు పావనమౌ; నటమీఁదిమాటకున్
ములు చనుగాను నీమనసుముచ్చుటఁ దీర్చెద నోతలోదరీ. ‖ 79 ‖

క. అహమికను నన్ను దూఱిన, తహతహచే నపుడు నీకు దయ లేదనుచున్
బహువిధముల నెదురాడితి, నహహా నాయంతవెతల నందవె నీవున్. ‖ 80 ‖

ఉ. కంతునిగంతు లెంచి కనుగంటికిఁ బుట్టెఁడు నీరునించి యం
తంతకుఁ దల్లడించి ధృతి యల్లలనాడఁగ నిచ్చగించి యా
ద్యంతములున్ దలంచి చెలులాడుకొనన్ దలవాంచి వాంఛచే
నెంతవిరాళిఁ బొందితివొ యెంతకృశించితివో తలోదరీ! ‖ 81 ‖

చ. చెలి నినుఁబాసి యే నిదురఁజెందమి ఱెప్ప లెఱుంగుఁ గాఁకచేఁ
దలఁగుట మే నెఱుంగు రుచిదప్పుట జిహ్వ యెఱుంగు నొంటి నే
నిలుచుట నీ వెఱుంగుదువు నిన్నును నీమదిలోనిచింతయున్
దలఁచిన గుండెలో దిగులు దైవ మెఱుంగును బ్రాణనాయికా. ‖ 82 ‖

చ. నలువురిమాటలున్ వినక నాతలిదండ్రుల నమ్మఁబోక పె
ద్దలు తెలుపంగ నూఁకొనక దైవమునుం గొలువంగలేక నీ
చెలిమియె భుక్తి ముక్తి యని చేరితి నింతటిదాన వౌట నేఁ
దెలియక మోసపోతిఁ బరదేశిని జేసితి వంగనామణీ. ‖ 83 ‖

క. ఈవగను వగకు వగకును, భావనతో నూఱుపద్యములు చెలి నీకై
యీవఱకును రచియించితి; నీవేగతి; లోకమెల్ల నినుఁ గొనియాడున్. ‖ 84 ‖

ఉ. జిత్తులకత్తె లిచ్చకముఁ జేయుచుఁ బైపయి నాసఁగొల్ప నే
నత్తఱి నన్నియు న్మఱచి యంతకుఁ జొచ్చితి; బొంక నేర; వా
దత్తిఁక నీవు నేవగను దండనఁ జేసినఁ జేయఁ జెల్లు; నీ
చిత్తము నాదుభాగ్య మిఁకఁ జెప్పెడి దేమి కురంగలోచనా. ‖ 85 ‖

ఉ. ద్రోహి నటంచు నేఁడుగద తోఁచెను; ముందటి చిన్ననాఁటి నా
మోహముఁ జూచియైన నను ముందుగఁ గైకొనరాదె కోప మే
కే హరిణాక్షి! నానడత లేగతి నుండిన నుండెఁగాక; యీ
దేహము నీయధీన; మిది యెంచియుఁ గౌఁగిటఁ జేర్పరాదఁటే. ‖ 86 ‖

సీ. ననచూపక ఫలించు పనసభూజము భంగి, సుదతీరో! మును మేలు చూపినావు
పూచినంతనె కాచి పొల్చుమామిడిమాడ్కి, నెలత! మది దయ నిలిపినావు
పూచి పిమ్మట రాలిపోవుపాటలిలీలఁ, దరుణిరో! కలప్రేమ దాఁచినావు
పూచి కాచి ఫలించు భూకల్పకమురీతి, మగువరో! యిఁకనైన మనుపఁగలవు
గీ. నీకు నీయంతఁదోపని నెనరు ప్రేమ, బలుకువగలను నడతలఁ దెలుప వశమె
నిన్నువంటిది నసువంటినెవరువానిఁ, జలము సేయుట యిది పూర్వఫలము గాదె. ‖ 87 ‖

క. కలికీ! పలుకవె; చిలుకల, కొలికీ! దయఁ జూడరాదె; కోపం బేలే?
యలికీరంబుల కిదిగో, యళికెను నాడెంద మెందు కలయించెదవే. ‖ 88 ‖

గీ. ఆన విడు నీదుపదములనైన వ్రాలి, వేడుకొనియెద దయపుట్ట విన్నవించి
పడతి కాదేని హృదయతాపంబు దీఱ, నాన విడువుము నీయధరామృతంబు. ‖ 89 ‖

గీ. రమణి దాసరితప్పు దండమునఁ బోవు, నందు రందుకు నోచనై తిందువదన!
యింక దయ నేలుదో భాగ్య మింతొ యనుచుఁ, దొలుతఁ దను దోడితెచ్చినచిలుకఁ జూచి. ‖ 90
‖

చ. కడకడయుండెదేమె చిలుకా! మును నమ్మిక లీ వొసంగఁగాఁ
దొడిఁబడి నమ్మి వచ్చితిని దోచినరీతిని విన్నవించితిన్
గడపట నేమిలేక ననుఁ గంతునిచేతికి నప్పగించె మీ
పడఁతుక, యౌను గా దనుచుఁ బల్కదు; నీవును నూరకుండెదే? ॥ 91 ॥

క. చిలుకలకొలికికిఁ గలికికి, నలుకఁట, పలుకదఁట చలములఁట నీ వైన
గులుకువగఁ గులుకుకపురపు, బలుకలొలుక వలపుఁ జిలుకఁ డలుకవె చిలుకా! ॥ 92 ॥

గీ. మరుఁడు గుఱి గాఁగ నేనాడుమాట యొకటి, చెవులఁ జొరదాయె చిలుక యాచెలికి నేఁడు
నూఁది త్రిప్పంగ దారంబు నూతపడును, భామ యిటులున్న మగవాఁడిఁ కేమి సేయు. ॥ 93 ॥

వ. అనిన రాధికాతిలకంబు తనపెంపుడుచిలుకం బేర్కొని యిట్లనియె. ॥ 94 ॥

క. నే నెవ్వతెఁ దను మనుపను, దా నెవ్వఁడు నన్ను వేఁడఁ దనకు న్నాకున్
బూనిక నేసంబంధమొ, వైనము నీ వడుగనేరవా యని గదుమన్. ॥ 95 ॥

వ. చిలుక యిట్లనియె. ॥ 96 ॥

క. నీ వనఁగా నతఁ డనఁగా, నే వినగా జాల; నెల్ల నీతులు గీతుల్
నీ వెఱుఁగు దాత డెఱుఁగు, బోవే యనఁ గృష్ణు డలుక మొగమునఁ దొలఁకన్. ॥ 97 ॥

గీ. ఇంత పనిలేనిపనికి నే నేల పెనగ, ననుచు మెడజాఱుసిగఁ గేల నదుముకొనుచుఁ
దగటుదుప్పటి వలంలెవాటుగ ఘటించి, లేచి తల యూఁచి రాధను జూచి పలికె. ॥ 98 ॥

ఉ. తీరని మోహతాపమున దీనతచే బతిమాలి చూచి వే
సారితి నింక నీచెలిమి చాలును నీవెత నీకు ముద్దె; నే
నూరికిఁ బోయెదం గరుణ యుంచవె యించుక యూఱడింపగా
నేరకపోతి నంచుఁ జెలి నీవెత లెంచెద వింకమీదటన్. ॥ 99 ॥

చ. సొలయక యెన్నిదేశములు చూచితి నెందఱితోడ నేస్తముల్
సలిపితి నెంత ముచ్చటకుఁ జాలితి; నెవ్వియు నిల్వవాయె నీ
నిలుకడమాట నీనెనరు నీరసికత్వముఁ జాల నమ్మితిన్
జెలి! కలనైన నన్ను మఱచేవు సుమీ యెవ రెన్ని చెప్పినన్. ॥ 100 ॥

చ. కులుకుమిటారి నీవు నెలకొన్నపురంబును నీగృహంబు నీ
చెలులును నీవు నీసొలపుఁజిన్నెలు నీవగలున్ మనంబునన్
నెలకొన గుండె జల్లుమను నేఁటికిఁ దీఱనిపైనమాయె ముం
గల నినుఁ జూడనౌనె! యవుఁగా పరదేసుల కేడ వేడుకల్. ॥ 101 ॥

ఉ. ఒక్కొక్కనాఁటి నీనడత లుల్లమునం దలపోసి యే
చిక్కులకైన నోర్చి దరిఁ జేరుదుఁగా యని చాల నమ్మితిన్
మక్కువలేనిచోట బతిమాలిన నామది కందుఁ; గాక యా
తక్కువనేస్తమైన మితిదప్పిన వేసట గాదె యేరికిన్. ॥ 102 ॥

చ. పకపక నవ్వుచుం జెలఁగి పైకొనుచున్ రతులం బెనంగి పా
యక మనమున్న చంద మిసుమంతయు నే మఱవంగఁజాల; నెం
దుకుఁ బలుమాట; లీతనువుతో నెఱనమ్మిన నామనంబుతో
నిక నొకకాంతతోఁ జెలిమి యేమన సేయఁగలాఁడ మానినీ! ॥ 103 ॥

చ. పలువురు నీకుఁగాఁ బడినపాటులు నీమనసే యెఱుంగు; నీ

చలమును నీతృణీకృతియు జవ్వని నామనసే యెఱుంగు; న
వ్వల ననువంటిమేలుగలవాని గడించుకొనంగలేవు; నా
వలనను దూఱు లేదు; సెలవా యిఁక నీమకు ముద్దుకోమలీ. ‖ 104 ‖

మ. పరునై వచ్చితిఁ గాని నేరములు నాపైనుంచి కోపించు టే
నెఱుఁగ న్నామది చల్లఁజేసితివి యీ యిల్లేల? యీ రేల? యె
వ్వరు నాకేల? ఋణానుబంధములు గావా యన్నియు న్నేఁటితో
సరి గాఁబోలును బోయివచ్చెదఁ గటాక్షం బుంచుమీ రాధికా. ‖ 105 ‖

మ. అని పల్క న్విని కల్కి యెంతపలుకయ్యా యింతగా నేరకుం
డిన లోచేతువె రాజకన్యకల; నెంతే జాలుఁ దెల్పెల్లఁ బా
లనుచు న్నమ్మెడిగొల్లవారికడ; నాహా నేము నీ చేతులన్
గనినా; మన్నియు నీకటాక్షముననే కాదా ప్రవర్తించుటల్. ‖ 106 ‖

మ. నను నేఁ డెవ్వతెనంచుఁ జూచెదవు కృష్ణా నిన్నుఁ బోకుండ బ
ల్మిని బ్రార్థించెదనంచు నెంచితివొ యౌలో యంతకుం జాలవే
యనుఁగుంబోటులయిండ్ల కేఁగెదవొ భాగ్యం బాయెఁ బోపొమ్ము ప్రే
మను నేఁ జూచెద నిన్ను నన్నుఁ దెగడే మాయూరిపూఁబోడులన్. ‖ 107 ‖

చ. తెగువల నమ్మలక్కలు పతివ్రతలై నను దూఱువారు; నే
నొగి వినుదాన; నీవు కడనుండెడివాడవె; నీవు వారునుం
దగవున మెచ్చుసేయుదును; దప్పినఁ జూచెద; నింటికెల్లనుం
బొగడికఁ దెత్తుగాదె; యెటు పోయెదు నిన్విడ నెన్నిభంగులన్. ‖ 108 ‖

చ. అనుచు బిరాన లేచి వనజాక్షునిదుప్పటికొంగుఁ బట్టి గొ
బ్బున నెటు పారిపోయెదవు పోదువు గా కని శయ్యమీఁదికిన్
బెనగుచుఁ దీయ నొయ్యనఁ దమిన్ బిగికౌఁగిటిలోఁ గదించి రా
ధను గరఁగించె శౌరి తనుతాపము దీఱఁగఁ గోప మాఱగన్. ‖ 109 ‖

చ. చలమును గోప మీరసము జవ్వని కేడకు డాఁగిపోయెనో
తెలియదు కొంతసేపు తనదేహము తా నెఱుఁగంగలేక మై
పులకల నప్పటప్పటికిఁ బొంగుచు నిక్కువలంట సోలుచున్
బలుకక యూరకుండె నలమాధవుకౌఁగిట రాధ వేడుకన్. ‖ 110 ‖

క. చెలువయఁట రాధ; కృష్ణుఁడు, చెలువుండఁట; చిన్ననాఁటిచెలిమఁట; యెడలై
కలసినవారఁట; వారల, మెలకువలకుఁ దమికి మట్టుమేరలు గలవే. ‖ 111 ‖

మ. కొమరుంబ్రాయపుజిన్నిచన్నుఁగవముక్కుల్ నొక్కి కోరాడి కం
ఠమునం గేలు గదించి యిక్కువలు గోటన్ మీటి నెమ్మేన లేఁ
జెమటల్ గ్రాలఁగఁ గౌఁగిలించి బడలించెన్ జొక్కి తా నెంతయున్
దమి రాధామధురాధరాధరసుధాధారల్ చవింగ్రోలుచున్. ‖ 112 ‖

ఉ. చిక్కితి వంచు రాధ యొకచే హరికంఠము గౌఁగిలించి తా
నక్కున వ్రాలి చూడకుమటంచును నించుక మోడిసేయుచుం
జక్కెరయోని యాని నిలజాలక కన్నరమోడ్చి సోలుచుం
బుక్కిటివీడె మందుకొని ముద్దుల నొద్దిక మాటలాడుచున్. ‖ 113 ‖
నిరోష్ఠ్యమత్తేభవృత్తము గిలిగింత న్నగి కాంత కాంతకృతసంకేతజ్ఞయై యిచ్చఁ జం
చలతాటంకరథాంగగండయుగయై సత్యంక్తచేలాంతయై
చెలరేఁగెన్ గరినస్తనార్ద్రనఖనిశ్శేషాధరగ్రాహియై
గళనాదాంగదఘంటికాకలకలాక్రాంతాంగణేచ్ఛారతిన్. ‖ 114 ‖

చ. గళరవ ముప్పతిల్ల బిగికౌఁగిటఁ జన్నులు పిక్కటిల్ల నం
దెలరవ మావహిల్ల గడిదేరినవార్తలు గ్రక్కతిల్ల మే
ఖలరొద తారసిల్లఁ దెలికన్గొన లించుక సొమ్మసిల్ల నూ
ర్పులు వడిసంఘటిల్లఁ దమిఁ బొంగి లతాంగి చెలంగి పైకొనెన్. ॥ 115 ॥

ఉ. అంత రతాంతమందుఁ గమలాక్షుఁడు రాధికమోముఁ జూచి యా
వింత లిఁకేమి తెల్ప నొకవేడుకలోఁ బదివేలువేడ్క లం
తంత ఘటింపనేర్చితి వహా నెఱయోధవు గావె నీవు నీ
వింతకు నేరకున్న భ్రమియింతువె కృష్ణుని లోకు లెన్నఁగన్. ॥ 116 ॥

ఉ. కోమలి యెంత నీవు పయికొన్నను మున్నొక లేనియెమ్మెతో
నామికచేత నే రతులయందు మెఱుంగక యొల్లనంటి నేఁ
డేమని విన్నవింతుఁ దనువెల్లను బావనమాయె నీఋణం
బేమిటఁ దీర్చుకొందు సొలయించితి వన్నిట నన్ను వేడుకన్. ॥ 117 ॥

క. అన విని రాధిక కృష్ణునిఁ గనుఁగొని యానవ్వుమోము కళగలచెక్కుల్
నునుమోవియుఁ దెలిగన్నులు, గొనబువఁ బలుమారు ముద్దుగొనుచు న్నగుచున్. ॥ 118 ॥

ఉ. తేరనినిద్రమంపు దగదీఱనియూర్పులపెంపు పచ్చికా
టాఱనిమోవికెంపు చెమటాఱనిచెక్కులసొంపు జాఱియున్
జాఱనిపైఁటలోనిబిగిచన్నులక్రొన్నెలవంకగుంపు చె
న్నార నొయారముల్ గులుక నచ్చెలి యప్పుడకిల్లు వెల్వడెన్. ॥ 119 ॥

క. ఆనడత నెఱిఁగి యెఱుఁగని, దానివలెనె యాయశోద తా నుండఁ దనుం
దానయి నందుం డడిగినఁ, బోనీ మనకేమి యనుచుఁ బొలఁతుక నవ్వున్. ॥ 120 ॥

క. ఈరీతిఁ గొన్నిదినములు, కూరిమితో రాధ వగలకున్ లోనై యా
శౌరి వసియించి యొకనాఁ, డారమణిన్ సమ్మతిల్ల నాడి సుముఖుఁడై. ॥ 121 ॥

గీ. పదిదినములకు మఱలివచ్చెదనటంచుఁ, దల్లిదండ్రులతోఁ దెల్పి యెల్లచెలుల
బూర్వసఖులను బ్రియమున బుజ్జగించి, రాధతోఁగూడ వెడలె నమ్మాధవుండు. ॥ 122 ॥

చ. రథముపయి న్వసించి కవిరాజులు రాజులు నేస్తకాండ్రు వే
విధముల వెంటరా నమితవేగముతో నతివైభవంబుతో
నధికముదంబుతోఁ దలఁచినప్పుడె ద్వారిక కేగుదెంచె దన్
రథగజవాజివీరభటనాథు లెదుర్కొనఁగా మహోన్నతిన్. ॥ 123 ॥

ఉ. ఇట్లు పురంబుఁ జేరునెడ నేమని తెల్పుదుఁ దోరణాలమే
ల్కట్లను మంచెలన్ బురుజుల న్విడితేరులఁ జప్పరాలయ
ర్కట్ల జవాదివాసనలు ఘమ్మున బంగరుమేడలన్ జెలుల్
పొట్లముగా సుమంబులను బోయఁగ నబ్బుర మయ్యె రాధకున్. ॥ 124 ॥

మ. హరిఁ జూడన్ బుర మెల్ల ఘుల్లుమనె; నాహా రాధ మాకేడ దా
పురమై వచ్చె నటంచు రుక్మిణిమొదల్ పూఁబోఁడు లేమేమొ యెం
చిరి; శ్రీకృష్ణుఁడు పూర్వపక్షములఁ దా సిద్ధాంతముల్ చేయునే
ర్పరిగానన్ సరిమిద్దెలోన నిడెఁ బూర్వస్నేహయౌ రాధికన్. ॥ 125 ॥

మ. పయిపై రుక్మిణిసత్యభామల రమింపంగాఁ బదార్వేలుక
న్నియలం గూడఁగ నిర్వికారుఁ డనిన న్నిర్మోహియౌ నిర్జితేం
ద్రియుఁ డౌనన్నను దాలియిండె వెనుక; న్నిక్కంబుగా రాధపై
దయవాఁడై యపుడున్నచిన్నెలు వృథాతత్త్వంబు లయ్యెం గడున్. ॥ 126 ॥

ఉ. చేకొని మంత్రులం దిడియె సీమవిచక్షత; కార్యఖడ్గము
లీ్వకఁ గుమాళ్లయం దిడియె; విద్యల, బెద్దతనంబులన్ గుల
స్త్రీకుళకంబులం దిడియెఁ; జిన్నెలి కేమన రాధతోడిదే
లోకము గాఁగ నుండె నిఁక లోకులు కాముకుఁ డంచు నెంచరే. || 127 ||

చ. కవ విడలేక జక్కవలకైవడి రాధయు మాధవుం డిటుల్
దవులుకయుండఁగాఁ దమరు తాళక రుక్మిణి సత్యభామ జం
బవతియు మిత్రవిందయును భద్ర సుదంత కళిందజాతయున్
రవరవ నాడుకొంచు నొకరాతిరి లక్షణయింటి కేఁగినన్. || 128 ||

చ. పడఁతుక మ్రొక్కి వారికి సపర్యలు సేయుచుఁ దాను వారు నొ
క్కెడ వసియించి నెచ్చెలుల నెవ్వరి నుండఁగనీక యోజనల్
నడుపుచు నీసునం దెగువ నల్వురు నాలుగుమాటలాడఁగా
నుడుకుచు సత్యభామ వినయోక్తుల రుక్మిణితోడ నిట్లనెన్. || 129 ||

గీ. నన్ను గయ్యాళి యందు రీకన్నెలెల్లఁ, దెలియ వినవక్క పట్టపుదేవి వీవు
పేర్మి నీతోడిసాటిగాఁ బెనఁగఁజేసె, దానవారాతి పారిజాతంబుకొఱకు. || 130 ||

ఉ. ఎన్నఁటికైన వాని చను వెవ్వతె నమ్మునె కృష్ణ కృష్ణ యా
యున్నదినాలలోన దయయుంచినవానివితానఁ బెద్దకున్
బిన్నకుఁ గాకయుండ నడపించును; చేసెడిబాసలంటిమా
యెన్న వశంబు గాదు నిజ మించుక లేదు తలంచి చూచినన్. || 131 ||

ఉ. ఇంచుక రాధసుద్ది మునుపే విని వేడితి; వారు వీరుఁ గ
ల్పించిరటంచు నో రదిమి లేదని బొంకిను నాఁడు; నాఁడె యి
ట్లించుకి యొద్దికైన మన మింతకు రా నడపింతుమే యిఁకం
గొంచెములోనె డానిపయిఁ గూరిమి తప్పునె? తప్పె యోజనల్. || 132 ||

వ. అనిన జాంబవతి సత్యభామ కిట్లనియె. || 133 ||

ఉ. ఎందుకుఁ దప్పె యోజనలు కృష్ణునితంట లెఱింగి దానిపై
నిందఘటింప నేమగును నేఁడవుఁ గా దనువారు లేరుగా
కందఱుఁ గారటంచు నిపు డక్కట రాధిక మేలుగల్గెనా
యందె రమింపఁగావలె నహర్నిశముం బనియేమి యేరికిన్. || 134 ||

వ. అనిన మిత్రవింద జాంబవతితో నిట్లనియె. || 135 ||

ఉ. ఎవ్వరికిం బనేమి యని యేటికిఁ బల్కెదు నాఁడు నీవు నే
మెవ్వరమంచు నుల్కితి; మొకించుక నేర్పుల నాటపాటల
న్నవ్వుల లోనుజేయవలె, నాఁటికి నాఁటికి గాక రిచ్చలన్
రవ్వలఁ బెట్టినన్ మనసు రంజిలనేర్చునె యెట్టివారికిన్ || 136 ||

వ. అనిన భద్ర మిత్రవిందతో నిట్లనియె. || 137 ||

ఉ. రచ్చల రవ్వలన్ మనసు రంజిలదంటివి; రాధ కేమిట
వ్వచ్చెఁ బ్రతిష్ఠ నేఁడు; మగువా మనమందఱ మొక్కమాటగాఁ
గచ్చెగ శౌరితోడఁ బలుకన్వలె రాధకు మాకుఁ గూడునే
విచ్చలు మేము గావలెనొ నీ కది కావలెనో యటం చిఁకన్. || 138 ||

వ. అనిన సుదంత భద్రతో నిట్లనియె. || 139 ||

చ. అదివలె మేము గావలెనొ యం చిపు డాడిన దాని మానునే;
యదివలె మీరుఁ గావలె నటం చను; నింకొకనేర్పు దెల్పెదన్;
పదటము లేక నందఱముఁ బద్మదళాక్షునిత్రోవఁ బోక నేఁ
డిదిమొదలున్ దిగించినవహిన్ సమయంబు ఘటింపఁగావలెన్. ‖ 140 ‖

వ. అనినఁ గాళింది సుదంతతో నిట్లనియె. ‖ 141 ‖

చ. సమయము సేయఁ గృష్ణునకు సాగకపోయిన దేమి; యందుచే
నమరఁగ రాధ కేమి కొదువయ్యెను; బిన్నటనాఁటనుండియున్
దమి తలకెక్కియున్న దయదప్పునె నేర్చితిమేని మందుమం
త్రములను బూని వానికిని దానికి భేదము సేయఁగాఁదగున్. ‖ 142 ‖

వ. అనిన లక్షణ కాళిందితో నిట్లనియె.

ఉ. మందును మంత్రమంచనెదు మంత్రము లిప్పుడు పాటిఁదప్పె; నీ
యందఱు మెచ్చ నే నొకయుపాయముఁ దెల్పెద రాధచెంతకే
పొందుగఁ జెప్పి పంపుదము “బుద్ధిని బెద్దవు నీవు, నీకు మా
కెందుకు నాదు నీవె తగ నెంచుక దిట్టము సేయు” మం చొగిన్. ‖ 143 ‖

వ. అనిన రుక్మిణీరమణీశిరోమణి యక్కామినీమణులం గనుంగొని నవ్వుచు నిట్లనియె. ‖ 144 ‖

ఉ. నిందలం నేయ నెందుకుఁ దృణీకృతి యెందుకు మించనాడఁగా
నెందుకుఁ గాదు కూడ దననెందుకు మోడి వహించి యుండఁగా
నెందుకు మందు మంత్ర మననెందుకు దైన్యముతోడ వేఁడుకో
నెందుకు నేవచింతు నొకయిక్కువ యించుక విందురేనియున్. ‖ 145 ‖

మ. మనోభోగంబుల నేమితక్కువలుగా మన్నించె నేవేళకై
నను మాటాడఁడొ బుజ్జగింపఁడొ రతిన్ మల్లాడుచుం దృప్తిగాఁ
దనువుల్ సౌఖ్యము లొందఁజేయఁడొ మహోత్సాహపూర్యచిత్తంబునన్
మనలోనన్ మనవారె యీర్ష్యలు వహింపన్ వారివే నేరముల్. ‖ 146 ‖

సీ. ఒకనిసొమ్మేమి వేఱొక్కనిసొమ్మేమి, చక్కెర కమరునే చిక్కఁదనము
లోకులు గననేమి తా కనుంగొననేమి, వెన్నెల పూసునే విన్నఁదనము
అంత గైకొననేమి యింత గైకొననేమి, యమృతాన కబ్బునే యల్పతనము
చెంత నుండిననేమి చేత నుండిననేమి, విరబంతి కబ్బునే వెగటుఁదనము
గీ. ఒకతె చవిఁగొన్న లేదె మోవికిని దీపి, నలుగురును జూడ లేదె నవ్వులకుఁ దెలివి
మాట యొకమాటు విన్నఁజాల్ మనకు తృప్తి, శౌరికడ నుండినను లేదె సంతసంబు. ‖ 147 ‖

మ. వినుఁ డేవేళను గష్టుఁ డేనగరికిన్ వేంచేసెఁ దా నెవ్వతెం
గని మాటాడెను వార లప్పటికి బల్కన్ మేర సర్వజ్ఞుఁడౌ
ఘనుఁ డేలా పొరపొచ్చెముల్ నడపు నింకన్ మానుఁ డీవార్త లో
య్యన నారాధ యొకింత విన్న మనకే యౌ జిన్నపో హీనముల్. ‖ 148 ‖

చ. అన నిది యుక్తమంచు నపు డందఱు సమ్మతిఁ జేసికొంచు మె
ల్లనె తమయిండ్ల కేఁగి యొకలాగున నుండిరి వారిమాటలే
యొనరికఁ బొంచులుండి విని యొద్దికఁ బెంపుడుచిల్క గ్రక్కునన్
దనకు వచింప రాధ విని తా నది శౌరికిఁ దెల్పెఁ దెల్పినన్. ‖ 149 ‖

క. ఈనుడువు లిపుడు వింటివె, యానడుమను నీవు చిలుక నంపిననాఁడే
నానావిధముల నడిగిరి, మానవతీ! నీదురాక మహి నల్పంబే. ‖ 150 ‖

వ. అనిన రాధికావధూతిలకం బతిముదంబునఁ గృష్ణునితో నిట్లనియె. ‖ 151 ‖

సీ. పల్లెతావులనున్న గొల్లదానిని దెచ్చి, నిధిరత్నములయందు నిలిపినావు
చెలఁగి రాధామాధవులచెల్మి హా యన, బిరుదైనకీర్తిఁ గల్పించినావు
ప్రౌఢలైన కిరీటపతులకన్యల మాని, ననుఁ బ్రాణపదముగా నడపినావు
సకలవిద్యారహస్యము లెఱుంగఁగఁ జేసి, దేహ మానంద మొందించినావు
గీ. నేఁడు నాపాలిదైవంబు నీవె యనినఁ, జాల దీమాట నామహోత్సాహమునకు
యెంత సంతోషపడెదనో యెఱుకలేదె, మొదటి కిటు చేయు సర్వజ్ఞమూర్తి వీవు. ‖ 152 ‖

గీ. ఒకటఁ గొఱతయు లేక నే నున్నదాన, నైన నావిన్నపం బిపు డాదరింపు
నీదుపట్టపుదేవులు నేను నీవు, బంతిభుజియింపవలె రేపు సంతసమున. ‖ 153 ‖

చ. అని మఱునాడు వారికిఁ బ్రియంబుగ సమ్మతి గాఁగ శౌరిచే
తనె పిలిపించి వారలును దానును గృష్ణునిఁగూడి బంతులై
యనువుగఁ బంచభక్ష్యపరమాన్నములన్ జవు లెంచికొంచు భో
జన మొనరించి ధౌతకరసారసలై ముదమంది రందఱున్. ‖ 154 ‖

మ. నవరత్నస్థగితంపుసొమ్ములను నానాగంధపుష్పాదుల
న్నవరంగత్కనకాంబరంబులను గాంత ల్వింతలై చేరి చు
ట్ల వసింపం గొలువున్నమాధవునిదండ న్నిల్చి యారాధ మ
క్కువతోఁ బల్కెను గప్పురంపునునుబల్కుల్ దళ్కులం జిల్కఁగన్. ‖ 155 ‖

మ. పొలుపొ రుక్మిణిసత్యభామలకు నీపూఁబోండ్ల కాయున్నక
న్నెలకు న్నేఁ జెలికత్తెనై తెలిపెదన్ వీరల్ భవత్ప్రీతికై
కలహం బందఁగ నేల? పంచి వరుసల్ గల్పించి గోపాల వీ
రలరన్ దిట్టము చేసి చేసెదను మాధ్యస్థంబు నే నియ్యెడన్. ‖ 156 ‖

చ. ఒకనెల కొక్కమేర వినుఁ డున్నదినంబులలోఁ బదాఱువే
లకును బదాఱునాళు; లవల న్మఱి యార్గురి కాఱునాళ్ళు నొ
క్కొకటిగ లక్షణాదులకు నొప్పగు; సత్యకు రెండునాళ్లు; నం
దుకు నొక టెచ్చు రుక్మిణికిఁ దోఁచినచో దయ నిల్పు వెల్తికిన్. ‖ 157 ‖

గీ. అనుచు నోయక్కలార నే నంటి ననుచుఁ, గోప ముంచకుఁ డీమేర కొదువ గాదు
సమ్మతిలుఁ డంచు సతులమొగమ్ముఁ జూచి, హరికి మొదలుగ రాధ యందరకు మ్రొక్క. ‖ 158 ‖

క. కూర్చుండు మనుచు రాధం, గూర్చి పడంతుకలు మెచ్చుకొనుచుం బ్రియముం
గూర్చి పలుకంగఁ గృష్ణుఁడుఁ, గూర్చుండఁగ నిడియె నవ్వుకొనుచుం జెంతన్. ‖ 159 ‖

ఉ. అంతట వారి వారిని గృహంబులకున్ సెలవిచ్చి రాధికా
కాంతను గృష్ణదేవుఁడు తగనే గరఁగించి చెలంగి వింతకున్
వింతలుగాఁ దమిన్ వరుసవెంబడి నందఱియిండ్ల కేఁగి య
త్యంతవిలాసమార్గముల దక్షిణనాయకుఁ డయ్యె నున్నతిన్. ‖ 160 ‖

క. విను రాధామాధవకృతి, మనమున నిడి వినినఁ జదివి మఱి వ్రాసిన మె
చ్చిన యాధన్యాత్ములకున్, వనజాక్షుఁ డొసంగు సకలవైభవము దయన్. ‖ 161 ‖

గీ. అనుచు శుకయోగి తెలుప నజ్జనకవిభుఁడు
కృష్ణుఁడును రాధయును గాక యిఁకను గలరె
దైవము లటంచు వారల భాసమునను
దలఁచి మ్రొక్కుచు శుకయోగిఁ గొలిచియుండె. ‖ 162 ‖

ఉ. కృష్ణయమంత్రిపుత్త్ర! సుకవీంద్రముఖాంబుజకంజమిత్ర! శ్రీ
కృష్ణపదాబ్జసంతతవశీకృతచిత్త! నవీనచిత్తజా!
జిష్ణుసమానభోగ! గుణచిత్రవిశేష! గభీరసాగరా!
వైష్ణవసమ్మతప్రకటవస్తువిచారణ! మంత్రివారణా! ‖ 163 ‖

క. చతురతరవచనరచనా, చతురానన! కవినిధాన! సంతతదానా!
మితభాషణ! హితపోషణ!, మతితోషణగుణధురీణ! మాన్యవిహరణా! ‖ 164 ‖

మాలిని. మగదలకులధీరా! మానినీచిత్తచోరా!
యగణితగుణహారా! యర్థిరాధాకుమారా!
నిగమవిధివిహారా! నిత్యసౌఖ్యానుసారా!
సగరభవగభీరా! చారుశృంగారవీరా! ‖ 165 ‖

గద్య. ఇది శ్రీ మద్వేణుగోపాల వరప్రసాదలబ్ధ శృంగార కవిత్వ వైభవ
వెలిదిండ్ల తిరువేంగళార్యతనూభవ విద్వజ్జనవిధేయ వేంకట
పతినామధేయ ప్రణీతం బైన రాధామాధవసంవా
దంబను మహాప్రబంధంబునందుఁ సర్వంబును
తృతీయాశ్వాసము.
సంపూర్ణము.